# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 235 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | బుధవారం 15 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 235 15-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




## ‘వికసిత భారత్’కు ఇది ఊతమిస్తుంది

గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటనపై ప్రధాని మోదీ హర్షం

- మిగతా 3 లో..

## ప్రాణాంతకం... ఈ మూడు భారత సిరప్‌లు

# వాడొద్దు : డబ్ల్యూహెచ్‌ఓ

- డబ్ల్యూహెచ్‌ఓ కల్తీ మందుల జాబితాలో కోల్డ్రిఫ్, రెస్పిఫ్రెష్ టీఆర్, రీలైఫ్ సిరప్‌లు
- మధ్యప్రదేశ్‌లో పిల్లల మరణాలతో వెలుగులోకి వచ్చిన ఉదంతం
- ప్రపంచ దేశాలను అప్రమత్తం చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ
- కోల్డ్రిఫ్ సిరప్‌లో 48 శాతం విష రసాయనం గుర్తింపు
- తయారీ సంస్థ లైసెన్సు రద్దు, యజమాని అరెస్ట్




భారత్‌లో తయారైన మూడు కల్తీ దగ్గు మందులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) హెచ్చరికలు జారీ చేసింది. ఇటీవల మధ్యప్రదేశ్‌లో పలువురు చిన్నారుల మరణాలకు కారణమైన కోల్డ్రిఫ్ సిరప్‌తో పాటు మరో రెండు మందులు అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేసింది. ఈ ఉత్పత్తులు ఏ దేశంలోనైనా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రపంచ దేశాలను కోరింది. డబ్ల్యూహెచ్‌ఓ గుర్తించిన కల్తీ మందుల జాబితాలో స్రెసాన్ ఫార్మాస్యూటికల్స్‌కు చెందిన కోల్డ్రిఫ్, రెడ్‌నెక్స్ ఫార్మాస్యూటికల్స్ వారి రెస్పిఫ్రెష్ టీఆర్, షేప్ ఫార్మాకు చెందిన రీలైఫ్ సిరప్‌లు ఉన్నాయి. ఈ మందులు ప్రాణాంతక వ్యాధులకు కారణం కావొచ్చని, వీటి వాడకం తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించింది. తమిళనాడులో తయారైన కోల్డ్రిఫ్ సిరప్‌లో డైథిలిన్ గ్లైకాల్ (డీఈజీ) అనే విష రసాయనం అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. దీని పరిమాణం కేవలం 0.1 శాతం మాత్రమే ఉండాల్సి ఉండగా, ఏకంగా 48 శాతానికి పైగా ఉన్నట్లు గుర్తించడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటన అనంతరం తమిళనాడు అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. స్రెసాన్ ఫార్మాస్యూటికల్స్ తయారీ లైసెన్సును రద్దు చేయడంతో పాటు, కంపెనీ యజమాని జి. రంగనాథన్‌ను అరెస్టు చేశారు. నాణ్యతా ప్రమాణాల్లో లోపాలను గుర్తించేందుకు రాష్ట్రంలోని

- తరువాయి 2లో..

# ఏపీలో ‘గూగుల్ ఏఐ హబ్’..

- చంద్రబాబు, కేంద్ర మంత్రుల సమక్షంలో ఒప్పందం
- విశాఖలో గూగుల్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు
- రూ.88,628 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనున్న టెక్ దిగ్గజం
- ఏపీ ప్రభుత్వంతో ఢిల్లీలో అవగాహన ఒప్పందం
- 1.88 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అంచనా
- భారత్‌లోనే తొలి ‘గూగుల్ ఏఐ హబ్’ విశాఖలో ప్రారంభం
- సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రుల సమక్షంలో ఒప్పందాల మార్పిడి






**న్యూఢిల్లీ అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చే ప్రయత్నాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక ముందడుగు వేసింది. టెక్ దిగ్గజం గూగుల్.. విశాఖపట్నంలో 1 గిగావాట్ సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో మంగళవారం ఢిల్లీలో ఒక కీలక అవగాహన ఒప్పందం (ఎమ్ఓయూ) కుదుర్చుకుంది. తాజ్‌మాన్‌సింగ్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ హాజరయ్యారు. ఈ ఒప్పందం ద్వారా గూగుల్ సుమారు 10 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.88,628 కోట్లు) పెట్టుబడి పెట్టనుంది. ‘గూగుల్ ఏఐ హబ్’ పేరుతో ఏర్పాటయ్యే ఈ కేంద్రం, భారతదేశంలోనే మొట్టమొదటి కృత్రిమ మేధస్సు కేంద్రంగా నిలవనుంది.

- తరువాయి 2లో..

## ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తిరుపతి, విశాఖపట్నంలను

# గుర్తించండి..

- ఉదయ్ పూర్ లో అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల పర్యాటక మంత్రులతో జరిగిన సమావేశంలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు మంత్రి కందుల దుర్గేష్ విజ్ఞప్తి
- సముద్రతీర, మెరైన్ గమ్యస్థానం గా విశాఖ, అధ్యాత్మిక, సాంస్కృతిక గమ్యస్థానంగా తిరుపతిని తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్
- ఏపీలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయి..దేశ పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్ ను అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మరింత సహకారం అందించాలని కోరిన మంత్రి దుర్గేష్
- కేంద్ర సహకారం, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఏపీ పర్యాటక రంగం అద్భుత పురోగతి సాధిస్తుందని వెల్లడి
- జాతీయ మిషన్ లక్ష్యాలను సాధించడంలో ఏపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని ప్రకటించిన మంత్రి కందుల దుర్గేష్



**ఉదయ్ పూర్: అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

దేశ పర్యాటక రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మరింత కేంద్ర సహకారం అందించాలని, కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రకారం ఏపీలోని తిరుపతి, విశాఖపట్నంలను ప్రపంచ పర్యాటక గమ్యస్థానాలుగా తీర్చిదిద్దాలని కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు మంత్రి కందుల దుర్గేష్ విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 14, 15 తేదీల్లో రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ మారియట్ హోటల్లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన అన్ని రాష్ట్రాలు

- తరువాయి 2లో..

## విశాఖకు 15 బిలియన్ డాలర్ల

# భారీ పెట్టుబడి

- దేశంలో తొలి ఏఐ డేటా హబ్ ప్రకటించిన గూగుల్
- అమెరికా వెలుపల అతిపెద్ద డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటుకు నిర్ణయం
- సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రుల సమక్షంలో ప్రకటించిన గూగుల్
- దేశంలో మొదటి గిగావాట్ స్కేల్ డేటా సెంటర్ విశాఖకు రావటం గర్వకారణమన్న సీఎం చంద్రబాబు
- భారత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కు ఇది సరికొత్త అధ్యాయమన్న ముఖ్యమంత్రి
- డేటా సెంటర్ ఏర్పాటు పై ఎక్స్ వేదికగా ప్రకటించిన గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్.
- విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ





**న్యూఢిల్లీ అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఆంధ్రప్రదేశ్ సువర్ణ అధ్యాయం లిఖించింది. ప్రపంచాన్ని శాసిస్తున్న డేటా,

- తరువాయి 2లో..

# బీహార్ ఎన్నికలు...

**71 మందితో తొలి జాబితా ప్రకటించిన బీజేపీ... బరిలో డిప్యూటీ సీఎంలు**

- బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ తొలి జాబితా
- 71 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించిన కమలం పార్టీ
- బరిలో ఇద్దరు ప్రస్తుత, ఇద్దరు మాజీ ఉప ముఖ్యమంత్రులు
- మాజీ ఎంపీలు రామ్ కృపాల్ యాదవ్, సునీల్ పింటూలకు టికెట్లు
- ప్రభుత్వాన్ని కాపాడిన కాంగ్రెస్ మాజీ నేతకు బహుమతి
- అనుభవం, కొత్తవారికి జాబితాలో సమ ప్రాధాన్యం

**బీహార్, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



బీహార్ అసెంబ్లీ ఎన్నికలు-2025 సమీపిస్తున్న వేళ బీజేపీ ప్రచారంలో వేగం పెంచింది. ఎన్డీఏ కూటమిలో సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చిన వెంటనే, మంగళవారం 71 మంది అభ్యర్థులతో కూడిన తమ తొలి జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో పలువురు ప్రముఖులకు, కీలక నేతలకు చోటు కల్పించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రులుగా ఉన్న ఇద్దరు నేతలను బీజేపీ మళ్లీ ఎన్నికల బరిలోకి దింపింది. ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ముంగేర్ జిల్లాలోని

- తరువాయి 2లో..

## టెక్ ప్రపంచంలో ఏపీకి..

# ఇదొక చారిత్రక రోజు

- మంత్రి లోకేశ్
- విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు
- 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెట్టనున్న టెక్ దిగ్గజం
- దేశానికి డేటా సెంటర్లు కొత్త రిఫైనరీల వంటివని మంత్రి లోకేశ్ వ్యాఖ్య
- సముద్రగర్భ కేబుల్ ద్వారా ఆసియా దేశాలతో విశాఖ అనుసంధానం
- వికసిత భారత్ లక్ష్య సాధనలో ఇదొక ముందడుగు అన్న కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్




ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ రంగంలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. టెక్ దిగ్గజం గూగుల్, విశాఖపట్నంలో భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ పరిణామం రాష్ట్ర భవిష్యత్తుకే కాకుండా, దేశ డిజిటల్ ప్రగతికి కూడా అత్యంత కీలకమని మంత్రి నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు. టెక్ ప్రపంచంలో ఏపీకి ఇది ఒక చారిత్రక రోజని అభివర్ణించారు. ఇక, ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు గూగుల్ ముందుకొచ్చినట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... “డేటా సెంటర్లు దేశానికి కొత్త రిఫైనరీల వంటివి. విజనరీ నాయకుడు చంద్రబాబు నాయకత్వంలో మరిన్ని ప్రాజెక్టులు ఏపీకి రానున్నాయి” అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గూగుల్ రాకతో ఏపీ గ్లోబల్ టెక్ మ్యాప్‌పై తన స్థానాన్ని పదిలం చేసుకుంటుందని,

- తరువాయి 2లో..

## హంద్రీనీవాతో రాయలసీమకు

# జలసిరి...

- హంద్రీనీవా పరిధిలో 517 ట్యాంకులకు, 299 కృష్ణాజలాలతో నింపాము.
- వైకాపా 5 ఏళ్లలో చేయలేనిది సంవత్సరంలోనే చేసి చూపించాం.
- సకాలంలో హంద్రీనీవా పనులు పూర్తి చేసిన అధికారులకు అభినందనలు.
- సుజల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.



**అమరావతి అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

హంద్రీనీవా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని మొత్తం 517 చెరువులకు గాను 299 చెరువులని కృష్ణాజలాలతో నింపామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. హంద్రీ నీవా నీరుతో చెరువులు నింపే కార్యక్రమానికి సంబంధించి కర్నూలు ఇరిగేషన్ సిఈ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారాయన. హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు సకాలంలో పూర్తి చేసిన అధికారులను అందరినీ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు. చివరన ఉన్న కుప్పం వరకు కృష్ణాజలాలు తరలి వెళ్ళడంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా, అధికారులు

- తరువాయి 2లో..

## పల్లె పండగ 2.0తో

## గ్రామాల రూపురేఖలు

# మార్చేయాలి

- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- పల్లె పండగ 2.0 కార్యక్రమంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమీక్ష
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు కీలక దిశానిర్దేశం





**అమరావతి అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ గ్రామాల ముఖచిత్రాన్ని సంపూర్ణంగా మార్చివేసే లక్ష్యంతో ‘పల్లె పండగ 2.0’ కార్యక్రమానికి పటిష్ఠమైన ప్రణాళికలు సిద్ధం

- తరువాయి 2లో..

## సంపాదకీయం

# ఉగ్రవాదుల ఉచ్చులో పాకిస్తాన్

పొరుగు దేశం పాకిస్తాన్ ఇంటాబయటా పెను సమస్యలతో సతమతమవుతోంది. ఉగ్రవాదాన్ని ఎగదోసి, ఆ మంటల్లో చలికాచుకుందామనుకున్న దాయాదిని ఇప్పుడవే మంటలు చుట్టుముట్టి, ఊపిరి సలపనివ్వడం లేదు. ఒకవైపు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి, దేశాన్ని ఎలా గట్టెక్కించాలో తెలియక పాక్ పాలకులు సతమతమవుతుంటే, ఉగ్రవాదం పెనుభూతమై కోరలు సాచి కబళించబూనడంతో దిక్కుతోచడం లేదు. గాజాలో పెచ్చుమీరుతున్న మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ వారం రోజుల క్రితం ప్రధాన రాజకీయ పార్టీలలో ఒకటైన తెహ్రీక్ -ఇ-లబ్బైక్ పాకిస్తాన్ కార్యకర్తలు ఇస్లామాబాద్, లాహెూర్, కరాచీ వంటి ముఖ్య నగరాల్లో చేసిన ఆందోళనలు ఆ దేశంలో శాంతి భద్రతల పరిస్థితి ఎంతగా క్షీణించిందో కళ్లకుకట్టాయి. ఆ అల్లర్లను అణచివేశామన్న సంతృప్తి షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి ఒక్క రోజైనా మిగలకుండానే అఫ్గానిస్తాన్‌తో ఘర్షణలు పెచ్చుమీరాయి. లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలకు ఊపిరులూది, ఇండియాపైకి ఎగదోసి వినోదం చూద్దామనుకున్న దాయాది దేశానికి తెహ్రీక్-ఇతాలిబాన్ పాకిస్తాన్ (టిటిపి) సీమాంతర ఉగ్రవాదం ఎలా ఉంటుందో రుచి చూపిస్తోంది. అఫ్గాన్ గడ్డపైనుంచి పాకిస్తాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ పాక్ ప్రభుత్వానికి కంటిమీద నిద్ర లేకుండా చేస్తోంది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులో ఇటీవల జరిపిన దాడుల్లో సైనిక నష్టం జరగడంతో పాక్ భగ్గుమంది. టిటిపి ప్రధాన నేతలను మట్టుబెట్టే ఉద్దేశంతో కాబూల్ పై బాంబు దాడులకు తెగబడటంతో తాలిబాన్ ప్రభుత్వం ఎదురు దాడులు ప్రారంభించింది. ఉగ్రవాదుల పీచమణిచేందుకు భారత్ చేపట్టిన సర్జికల్ స్ట్రయిక్స్, ఆపరేషన్ సిందూర్ ను తప్పుబట్టిన పాకిస్తాన్‌కు సీమాంతర ఉగ్రవాదం ఎంతటి ప్రమాద హేతువో ఇప్పుడు అర్థమవుతున్నట్లుంది. వాస్తవానికి అఫ్గానిస్తాన్ -పాకిస్తాన్ మధ్య సంబంధ బాంధవ్యాలు మొదటినుంచీ అంతంతమాత్రమే. ఇరుదేశాలనూ విభజిస్తున్న డ్యూరాండ్ రేఖను తాము గుర్తించబోమంటూ అఫ్గాన్ మొదటినుంచీ తెగేసి చెబుతూ వస్తోంది. తాలిబాన్ల చేతికి పగ్గాలు వచ్చాక ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింతగా క్షీణించాయి. దీనికి ప్రధాన కారణం తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్ సంస్థే. 2007లో ఏర్పడిన ఈ సంస్థ షియా వ్యతిరేక ఉద్యమాన్ని నెత్తికెత్తుకుని, ఆత్మాహుతి బాంబుదాడులకు పాల్పడటంతో అనతికాలంలోనే నిషేధానికి గురైంది. అఫ్గానిస్తాన్‌లో అమెరికా ఆక్రమణలకు మద్దతు పలికిందన్న కారణంగా పాకిస్తాన్ పై టిటిపి కక్ష గట్టింది. ఇమ్రాన్ ఖాన్ ప్రధానిగా ఉన్నప్పుడు టిటిపిని దారికి తెచ్చేందుకు తాలిబాన్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. కానీ, ఏ ఒప్పందమూ కుదరకముందే ఆయన జైలుపాలయ్యారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన ప్రధాని షెహబాజ్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చడమే లక్ష్యంగా టిటిపి మరింతగా పేట్రేగిపోతోంది. టిటిపి 2414 మంది పాక్ పౌరులను హతమార్చినట్లు పాకిస్తాన్‌కు చెందిన సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ సంస్థ అధ్యయనంలో తేలింది. తాజాగా టిటిపి పాక్ సైనికులను లక్ష్యం చేసుకోవడంతో ఉద్రిక్తతలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. అఫ్గాన్-, పాక్ రాజకీయ సంక్షోభంపై ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించినా, మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారత్‌తో సన్నిహిత సంబంధాలను ఆశిస్తున్న చైనా మాత్రం ఆచితూచి వ్యవహరిస్తోంది. శత్రువుకు శత్రువు మనకు మిత్రుడనే విధంగా పాక్ తో వైరం అఫ్గానిస్తాన్‌ను భారత్‌కు దగ్గర చేసింది. ఆ దేశ విదేశాంగ మంత్రి భారత్‌లో పర్యటిస్తున్నప్పుడే పాక్- అఫ్గాన్‌ల మధ్య ఘర్షణలు తలెత్తడం కాకతాళీయమే అయినా, భారత్ కు ఈ పరిణామం కలిసివచ్చే అంశమే. ఇరుగుపొరుగు దేశాలతో భారత్ సంబంధాలు అంతంతమాత్రంగానే ఉన్న నేపథ్యంలో అఫ్గాన్ దగ్గర కావడం ఒకింత హర్షించదగిన పరిణామం. అఫ్గాన్‌లో తాలిబాన్ ప్రభుత్వాన్ని భారత్ అధికారికంగా గుర్తించకపోయినా, పూర్తిగా ఆ దేశంతో దౌత్య సంబంధాలను తెంచుకోలేదు. పార్టీ విధేయుడు తాజాగా అఫ్గాన్ విదేశాంగ మంత్రి పర్యటనతో సంబంధాలు మళ్లీ బలోపేతం కానున్నాయి. కాబూల్‌లో నాలుగేళ్ల క్రితం మూసివేసిన దౌత్య కార్యాలయాన్ని మళ్లీ తెరిచేందుకు భారత్ అంగీకరించడం ఒక శుభపరిణామం. అఫ్గానిస్తాన్ పునర్ నిర్మాణంలో భారత్ ఇప్పటికీ తన వంతు పాత్ర పోషిస్తోంది. తాజా బడ్జెట్ లోనూ 25 మిలియన్ డాలర్ల సహాయాన్ని ప్రకటించడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. పాకిస్తాన్‌ను కట్టడి చేసేందుకు అఫ్గాన్‌తో స్నేహం వెదకబోయిన తీగ కాలికి తగిలిన చందంగా ఉపయోగపడుతుందని ఆశిద్దాం.

## ప్రాణాంతకం... ఈ మూడు భారత సిరప్‌లు వాడొద్దు : డబ్ల్యూహెచ్‌ఓ

ఇతర ఔషధ తయారీ కంపెనీల్లోనూ విస్తృత తనిఖీలకు ఆదేశించారు. మధ్యప్రదేశ్ ఘటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సైతం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక సూచనలు జారీ చేసింది. రెండేళ్లలోపు పిల్లలకు దగ్గు మందులు సూచించవద్దని, ఐదేళ్లలోపు వారికి కూడా సాధారణంగా వీటిని సిఫార్సు చేయరాదని స్పష్టం చేసింది. ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ఫార్మా రంగంలో మరింత కఠినమైన నియంత్రణ అవసరమని ఆరోగ్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఏపీలో 'గూగుల్ ఏఐ హబ్'..

అమెరికా వెలుపల గూగుల్ నిర్మిస్తున్న అతిపెద్ద డేటా సెంటర్ కూడా ఇదే కావడం విశేషం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే తదితరులు పాల్గొన్నారు.

**లక్షల ఉద్యోగాలు.. రాష్ట్రానికి ఆదాయం**

ఈ భారీ ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ఊతం లభించనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 2028-2032 మధ్య కాలంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తికి ఏటా రూ.10,518 కోట్లు అదనంగా సమకూరవచ్చని భావిస్తున్నారు. అన్నింటికన్నా ముఖ్యంగా, ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 1,88,220 ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా. ఈ డేటా సెంటర్ రాకతో విశాఖ నగరం పూర్తిస్థాయి 'ఏఐ సిటీ'గా రూపాంతరం చెందనుంది. గతేడాది అక్టోబర్‌లో మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన సందర్భంగా గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌తో జరిపిన చర్చలే ఈ ఒప్పందానికి పునాది వేశాయి. ఈ డేటా సెంటర్‌తో పాటు విద్యుత్, రియల్ ఎస్టేట్, టెలికమ్యూనికేషన్స్ వంటి అనుబంధ రంగాల అభివృద్ధికి కూడా మార్గం సుగమం అవుతుంది. దీని ద్వారా రాష్ట్రానికి పన్నుల రూపంలో కొత్త ఆదాయ వనరులు ఏర్పడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తిరుపతి, విశాఖపట్నంలను గుర్తించండి

మరియు కేంద్రపాలిత ప్రాంతాల పర్యాటక మంత్రులతో జరుగుతున్న సమావేశంలో ఏపీ ప్రభుత్వం తరపున మంత్రి కందుల దుర్గేష్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడిచిన 15 నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధికి తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ మిషన్ లో భాగంగా ఆంధ్రప్రదేశ్ తరపున విశాఖపట్నం, తిరుపతి లను ప్రధాన గమ్యస్థానాలుగా ప్రతిపాదిస్తున్నామని, ఈ ప్రాంతాలు తమ రాష్ట్ర వైవిధ్యాన్ని, సంసిద్ధతను, అంతర్జాతీయ ప్రమాణాలను ప్రతిబింబింపజేస్తాయని వెల్లడించారు. కేంద్ర బడ్జెట్ 2025-26 పేరా సముద్రతీర, మెరైన్ గమ్యస్థానం గా విశాఖ,అధ్యాత్మిక, సాంస్కృతిక గమ్యస్థానంగా తిరుపతిని తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. జాతీయ మిషన్ లక్ష్యాలను సాధించడంలో ఏపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల 50 పర్యాటక గమ్యస్థానాలను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన జాతీయ మిషన్ పై చర్చించడానికి ఏర్పాటు చేసిన ఈ చారిత్రాత్మక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించడం గర్వంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2024%-%29 నూతన పర్యాటక విధానం ప్రకటించిందని తద్వారా సమగ్ర, పెట్టుబడి-ఆధారిత విధానాన్ని అవలంబిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. గడిచిన 15 నెలల్లో దాదాపు రూ.12,000 కోట్ల పర్యాటక పెట్టుబడులతో పాటు తాజ్, ఐటీసీ, ఒబెరాయ్, హిల్టన్, లెమన్ ట్రీ వంటి ప్రపంచ ప్రసిద్ధ బ్రాండ్లతో కూడిన 21 హెూటల్ మరియు రిసార్ట్ ప్రాజెక్టులను ఏపీకి వచ్చేలా ఆకర్షించామన్నారు. రూ.4,500 కోట్లతో ఈ ప్రాజెక్టుల ద్వారా ఇప్పటివరకు 18,000 మందికి పైగా ఉద్యోగాలను సృష్టించామన్నారు. అంతేగాక గ్రామీణ,గిరిజన పర్యాటక సర్క్యూట్‌లలో 10,000 హెూమ్‌స్టేలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీకి ప్రత్యేకమైన పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్ట్ నర్ షిప్) నమూనా ద్వారా పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధిని ఏకీకృతం చేస్తున్నామని తెలిపారు. తద్వారా స్థానిక సంఘాలు, వ్యాపారవేత్తలు, అంతర్జాతీయ భాగస్వాములను ఒకే వేదికపై తీసుకువచ్చి కలిసి పని చేస్తున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. 2029 నాటికి పర్యాటక రంగం రాష్ట్ర జీవీఏలో వాటాను 4.6% నుండి 8%కు పెంచడం, 5 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించడం, 50,000 హెూటళ్లను ఏర్పాటు చేసే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. అంతేగాక తిరుమల పవిత్ర కొండలను మొదలుకొని విశాఖపట్నం సముద్రతీరాల వరకు, పచ్చని అరకు లోయ నుండి గోదావరి బ్యాక్ వాటర్స్, అమరావతి బౌద్ధ వారసత్వ క్షేత్రాల వరకు పర్యాటకులకు ఆధ్యాత్మిక, తీరప్రాంత, పర్యావరణ, ఆరోగ్య, సాంస్కృతిక,సాహస పర్యాటక అనుభవాలు అందిస్తున్నామన్నారు.

**విశాఖకు నూతన పర్యాటక శోభ:మంత్రి కందుల దుర్గేష్**

విశాఖపట్నాన్ని భారతదేశపు తొలి ఓషనేరియం, మెరైన్ ఎక్స్‌పీరియన్స్ పార్క్‌గా తీర్చిదిద్దాలని ఏపీ ప్రభుత్వం సంకల్పించినట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, క్రూయిజ్ టెర్మినల్, భీమిలి-రుషికొండ పర్యాటక కారిడార్‌ను ఒక శక్తివంతమైన తీరప్రాంత హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను కాన్ఫరెన్స్ లో వివరించారు.

**అధ్యాత్మిక విద్య, వెల్‌నెస్, సాంస్కృతిక కేంద్రంగా తిరుపతి:మంత్రి కందుల దుర్గేష్**

తిరుపతిలో పవిత్ర కొండల అధ్యాత్మికతను విస్తరించే దిశగా, "%బాజూఅతీఊఖుశ్రీ జఅజఅశ్రీఅఆఫ్అశీఅ వీబంవబఎ ఒ వీవ్ష్రశీశ్రీశీస్త్రఅఖుశ్రీ జుఃజూవతీఅవఅవ్వఖుతీఎ%" ను స్థాపించాలని యోచిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా భారతీయ నాగరికత కథను డిజిటల్ డోమ్స్, లైవ్ క్రాఫ్ట్ పెవిలియన్లు, "వాక్ ఆఫ్ ఫెయిత్" ప్రొమెనేడ్ ద్వారా తిరుమల పవిత్రతను కాపాడుతూనే అధ్యాత్మిక విద్య, వెల్‌నెస్ , సంస్కృతికి కేంద్రంగా నిలుపుతామన్నారు.

**భారతదేశ వైవిధ్యాన్ని, ప్రపంచస్థాయి పర్యాటక అనుభవాలను అందించేవి ఈ రెండు ప్రాజెక్టులు: మంత్రి కందుల దుర్గేష్**

తీరప్రాంతం,ఆధ్యాత్మికం కలగవలసిన ఈ రెండు ప్రాజెక్టులు భారతదేశ వైవిధ్యాన్ని, ప్రపంచస్థాయి పర్యాటక అనుభవాలను సృష్టించడానికి ఆంధ్రప్రదేశ్ సామర్థ్యాన్ని తెలుపుతాయని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు వివరించారు. ఈ రెండు గమ్యస్థానాల చుట్టూ హెూటళ్లు, రిసార్ట్‌లు, కన్వెన్షన్ సెంటర్లు, %వీ×జజు% మౌలిక సదుపాయాలను విస్తరించడానికి ప్రైవేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. విశాఖలో కన్వెన్షన్ సెంటర్లు, వాటర్‌ఫ్రంట్ రిసార్ట్‌లు, క్రూయిజ్ టెర్మినల్స్, సాహస అనుభవాలను సమన్వయం చేస్తూ విశాఖ నగరాన్ని వ్యాపార, విహారయాత్రలకు కేంద్రంగా నిలుపుతామన్నారు. అదే విధంగా తిరుపతిలో ఆధ్యాత్మికతను కొనసాగిస్తూ, ప్రపంచ స్థాయి వెడ్డింగ్, వెల్‌నెస్ , సాంస్కృతిక వేదికలు ఏర్పాటు చేసి భారతదేశపు అగ్రగామి గమ్యస్థానంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ద్వారా ఆర్థిక వృద్ధిని వారసత్వ సంస్కృతితో, ప్రైవేట్ వ్యాపారాన్ని ప్రజల భాగస్వామ్యంతో, ఆధునిక సాంకేతికతను సాంప్రదాయ విలువలతో మిళితం చేస్తామని తెలిపారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ మద్దతుతో ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశపు ప్రముఖ పర్యాటక రాష్ట్రంగా మాత్రమే కాక, 2030 నాటికి ఆసియాలోనే అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానాలలో ఒకటిగా నిలుపుతామని మంత్రి కందుల దుర్గేష్ ఘంటాపథంగా తెలిపారు. కేంద్ర సహకారం, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఏపీ పర్యాటక రంగం అద్భుత పురోగతి సాధిస్తుందని వెల్లడించారు. జాతీయ మిషన్ రూపకల్పనలో భాగంగా తాము ఏపీ పర్యాటక గమ్యస్థాన అభివృద్ధిపై దృష్టి పెడతామని టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట అన్నారు. చివరి మైలురాయి వరకు కనెక్టివిటీ, సౌకర్యాలు, సూచికలు, పారిశుద్ధ్యం, ఎలక్ట్రిక్ వాహన రవాణా మరియు డిజిటల్ విజిటర్ సిస్టమ్స్‌ను మెరుగుపరుస్తుందని తాము భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అవసరమైన ల్యాండ్ పార్సెల్స్, పెట్టుబడి ప్రతిపాదనలు, శిక్షణ పొందిన మానవ వనరులు, శక్తివంతమైన పాలనా వ్యవస్థతో ఏపీ సిద్ధంగా ఉందని తెలిపారు.

## విశాఖకు 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి

ఏఐ లాంటి రంగాల్లో విశాఖ నగరం కేంద్ర బిందువు కానుంది. ప్రపంచ ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖ వేదికగా భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రకటించింది. అమెరికా వెలుపల అతిపెద్ద ఏఐ డేటా హబ్ ను విశాలో ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది. ఈమేరకు ఢిల్లీలో జరిగిన భారత్ ఏఐ శక్తి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఏఐ డేటా హబ్ ఏర్పాటు కోసం రానున్న ఐదేళ్ల కాలంలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టనున్నట్టు గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ ప్రకటించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ" వచ్చే ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాలని గూగుల్ నిర్ణయించడం సంతోషం కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ భారీ పెట్టుబడి భారత డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ లో ఒక కొత్త అధ్యాయం. దేశంలో మొదటి గిగావాట్-స్కేల్ డేటా సెంటర్ విశాఖకు రావటం ఏపీకి గర్వకారణం. రియల్ టైమ్ డేటా, హిస్టారికల్ డేటాల సాయంతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీని భారత్ వేగంగా అందిపుచ్చుకుంటుంది. ఏపీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ను ప్రతీ కుటుంబానికీ దగ్గర చేసేలా ప్రయత్నిస్తాం. హైటెక్ సిటీ నిర్మాణంతో హైదరాబాద్ దశ మారింది. ఇప్పుడు విశాఖలో ఏఐ డేటా హబ్ రాకతో ఏపీ దశ మారుతుంది. ప్రధాని మోదీ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకుంటారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు గురించి చెప్పగానే ఆయన వచ్చే ఏడాది ఫిబ్రవరిలో గ్లోబల్ ఏఐ కాన్ఫరెన్సు నిర్వహించే విషయమై ఆలోచన చేశారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటుకు సహకరించిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్ లకు ధన్యవాదాలు. ఇంతటి భారీ పెట్టుబడిని ఏపీకి తీసుకురావటంలో ప్రధాన పాత్ర పోషించిన ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు అభినందనలు" అని ముఖ్యమంత్రి అన్నారు.

**డేటా సెంటర్ పాలసీతో ఏపీకి అతిపెద్ద గూగుల్ ఏఐ డేటా హబ్**

విశాఖలో ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేయబోతున్నట్టు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గిగావాట్ స్కేల్ కంప్యూటింగ్ కెపాసిటీ, సబ్ సీ గేట్ వే సహా భారీ స్థాయి ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు కోసం 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్టు తెలిపారు. దేశ ప్రగతిలో ఈ పెట్టుబడి, ఏఐ డేటా సెంటర్ కీలకంగా మారబోతున్నట్టు సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రధాని మోదీతో మాట్లాడినట్టు సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. ఈ ట్వీట్ పై స్పందించిన ప్రధాని మోదీ విశాఖ నగరంలో గూగుల్ ఏఐ డేటా హబ్ ద్వారా టెక్నాలజీ అందరికీ చేరువ అవుతుందని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా భారత నిర్మాణంలో ఈ ఐటీ మౌలిక సదుపాయం కీలకంగా మారుతుందని స్పష్టం చేశారు. ఇక భారత్ ఏఐ శక్తి పేరిట నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రులు ఈ ప్రాజెక్టుతో వివిధ రంగాలకు అవసరమైన సేవలు అందుతాయన్నారు. ఈ ప్రాజెక్టు అత్యంత వేగంగా అమల్లోకి రావటం దేశ ప్రగతిలో అత్యంత కీలకమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. విజనరీ నేతలు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంటి వారి ఆలోచనలు తీసుకువచ్చిన విధానాల వల్ల ఈ ప్రాజెక్టు సాకారం అయ్యిందన్నారు. ప్రోగ్రెసివ్ పాలసీలు, నిర్ణయాల్లో డైనమిజం వల్లే ఇది సాధ్యం కేంద్రంలోనూ, ఆంధ్రప్రదేశ్ లోనూ ఈ తరహా సుపరిపాలన ఉందిని తెలిపారు. టెక్నాలజీకి ఎక్కువగా ప్రాధాన్యమిచ్చే ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు దేశప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నాయని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. దేశంలో డేటా సెంటర్ పాలసీ ద్వారా ఈ తరహా డేటా సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయని అన్నారు. ఏఐ డేటా హబ్ ఏర్పాటుతో గ్లోబల్ కనెక్టివిటీ హబ్ గా విశాఖ మారుతుందని గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ వ్యాఖ్యానించారు. ఈ డేటా సెంటర్ ద్వారా వివిధ సంస్థలకు సరైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. భారత్ తో పాటు వివిధ దేశాలను అనుసంధానించేందుకు విశాఖలోని డేటా హబ్ వేదిక అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు , గూగుల్ సంస్థ ప్రతినిధులు పాల్గోన్నారు.

**విశాఖ నుంచే ప్రపంచ దేశాలకు అనుసంధానం**

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ద్వారా 2030 నాటికి గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని భారత కరెన్సీలో (రూ.1.33 లక్షల కోట్లు) విశాఖలో పెట్టనుంది. అమెరికా వెలుపల ప్రపంచంలోనే భారీ పెట్టుబడిగా గూగుల్ సంస్థ స్పష్టం చేసింది. గిగావాట్ స్కేల్ కంప్యూటింగ్ సామర్థ్యంతో ఏఐ డేటా హబ్ ను గూగుల్ విశాఖలో ఏర్పాటు చేయనుంది. గూగుల్ జెమిని ఏఐ, గూగుల్ సెర్చ్, గూగుల్ వర్క్ స్పేస్ , యూట్యూబ్, క్లౌడ్, జీమెయిల్ లాంటి సేవలను ఈ హబ్ ద్వారా అందించనుంది. భారత్ దేశంతో పాటు దక్షిణాసియా దేశాలైన సింగపూర్, మలేసియా సహా ఆస్ట్రేలియా లాంటి దేశాలకు విశాఖ ఏఐ డేటా హబ్ నుంచే గూగుల్ సేవలు అందనున్నాయి. మొత్తంగా విశాఖ నుంచి 12 దేశాలకు కనెక్టివిటీ ఏర్పాటు చేసుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను గూగుల్ సమకూర్చుకోనుంది. ఇందులో భాగంగా సబ్ సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ నిర్మిస్తోంది. రెండు మిలియన్ మైళ్ల కంటే పొడవైన సబ్ సీ కేబుల్ ద్వారా ప్రపంచానికి కనెక్టివిటీ కేంద్రంగా విశాఖ మారనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గూగుల్ యూజర్లకు మరింత వేగంగా సేవలు అందించేలా ఈ ఏఐ డేటా హబ్ సేవలు అందించనుంది.

## బీహార్ ఎన్నికలు... 71 మందితో తొలి జాబితా ప్రకటించిన బీజేపీ... బరిలో డిప్యూటీ సీఎంలు

తారాపూర్ నుంచి, మరో ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా లఖిసరాయ్ నుంచి పోటీ చేయనున్నారు. వీరితో పాటు ఇద్దరు మాజీ ఉప ముఖ్యమంత్రులు తార్కిషోర్ ప్రసాద్‌కు కతిహార్ నుంచి, రేణు దేవికి పశ్చిమ చంపారన్ జిల్లాలోని బెట్టియా నుంచి టికెట్లు కేటాయించారు. ఈ జాబితాలో ఇద్దరు మాజీ ఎంపీలకు కూడా అవకాశం కల్పించడం గమనార్హం. రామ్ కృపాల్ యాదవ్‌ను పాట్నా జిల్లాలోని దానాపూర్ నుంచి, సునీల్ కుమార్ పింటూను సీతామర్హి నుంచి అభ్యర్థులుగా ప్రకటించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ సీట్ల పంపకాల్లో భాగంగా సీతామర్హి స్థానం జేడీయూకు వెళ్లడంతో పింటూ పోటీ చేయలేకపోయారు. అలాగే, అంతర్జాతీయ షూటర్, సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన శ్రేయసి సింగ్‌కు జమూయి స్థానం నుంచి మరోసారి అవకాశం ఇచ్చారు. కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన సిద్ధార్థ సౌరవ్‌కు బిక్రమ్ నియోజకవర్గ టికెట్ కేటాయించారు. గతంలో నితీశ్ కుమార్ ప్రభుత్వం విశ్వాస పరీక్షను ఎదుర్కొన్నప్పుడు, ప్రభుత్వాన్ని కాపాడటంలో సౌరవ్ కీలక పాత్ర పోషించారు. ఆయనకు టికెట్ ఇవ్వడం ద్వారా పార్టీ విధేయతకు పట్టం కట్టినట్లు స్పష్టమవుతోంది. ఇక ఇతర ముఖ్య నేతలలో ఆరోగ్య శాఖ మంత్రి మంగళ్ పాండే సివాన్ నుంచి, పరిశ్రమల శాఖ మంత్రి నితీశ్ మిశ్రా ఝంఝార్‌పూర్ నుంచి పోటీ చేయనున్నారు. అనుభవజ్ఞులైన నేతలతో పాటు కొత్త ముఖాలకు కూడా ఈ జాబితాలో ప్రాధాన్యం ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మిగిలిన అభ్యర్థుల పేర్లతో రెండో జాబితాను త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉంది.

## టెక్ ప్రపంచంలో ఏపీకి.. ఇదొక చారిత్రక రోజు

డిజిటల్ ఇన్నోవేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల్లో కొత్త అధ్యాయం మొదలైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రియల్ టైమ్ గవర్నెన్స్ వంటి సేవలకు గూగుల్ మరింత సహకారం అందించాలని కోరారు. కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, గూగుల్ నిర్ణయం దేశంలోని ప్రతి ఒక్కరి జీవితంలో మార్పు తీసుకువస్తుందన్నారు. "టెక్నాలజీకి ప్రాధాన్యమిచ్చే ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు దేశ ప్రగతికి కీలకం. కేంద్రం తీసుకొచ్చిన డేటా సెంటర్ పాలసీ వల్లే ఇలాంటివి సాధ్యమవుతున్నాయి" అని వివరించారు. ఈ డేటా సెంటర్‌తో పాటు సముద్రగర్భ కేబుల్ వ్యవస్థ ద్వారా విశాఖ నగరం దక్షిణాసియా, ఆస్ట్రేలియా వంటి దేశాలతో అనుసంధానమవుతుందని తెలిపారు. మయన్మార్ మీదుగా ఈశాన్య రాష్ట్రాలకు కూడా కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు గూగుల్ సహకరించాలని ఆయన కోరారు. ఏఐ వల్ల ఉద్యోగాలపై నెలకొన్న ఆందోళనలను ప్రస్తావిస్తూ, నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా టెక్ నిపుణులకు మరిన్ని అవకాశాలు వస్తాయని కేంద్రమంత్రి భరోసా ఇచ్చారు. మొత్తంగా, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో కీలక ముందడుగుగా నిలుస్తోంది.

## హంద్రీనీవాతో రాయలసీమకు జలసిరి...

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. రాయలసీమకు గుండెకాయ అయిన హంద్రీనీవా ప్రాజెక్ట్ ని గత ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం ఆటకెక్కించింది అన్నారు. ఆ ప్రభుత్వం ఐదేళ్లలో చేయనిది, కూటమి ప్రభుత్వం సంవత్సరంలో చేసి చూపించిందని రామానాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లన్నీ 961 టిఎంసిల సామర్థ్యం ఉంటే 844 టీఎంసీలతో వాటిని నింపగలిగామన్నారు. అంటే 87.86% నీటిని నిల్వ చేయగలిగామని వివరించారు. అలాగే రాయలసీమలోని మొత్తం 38 నియోజకవర్గాల పరిధిలో హంద్రీనీవా ప్రాజెక్టు కాలువలు విస్తరించి ఉన్నాయి అన్నారు. ఈ కాలువలకు అనుబంధంగా 517 చెరువులు ఉన్నాయి. వీటిలో 174 చెరువులు పూర్తిగా, 125 చెరువులు పాక్షికంగా అంటే మొత్తం 299 చెరువులు నింపగలిగామన్నారు. మిగిలినవి ప్రాధాన్య క్రమంలో ఫిబ్రవరి మాసానికల్లా నింపుతామన్నారు. ఈ కారణంగా ప్రస్తుతం రాయలసీమ చెరువుల్లో జలసిరి తాండవిస్తోందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్న ఆయన ఆశయం మేరకు రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నామన్నారు. ప్రతిష్టాత్మకమైన హంద్రీనీవాకు రూ 3,850 కోట్ల రూపాయలు వెచ్చించడమే గాక 738 కిలో మీటర్లు కృష్ణమ్మ జలాలను కుప్పం వరకు తీసుకెళ్లడం ఒక చరిత్రగా మంత్రి అభివర్ణించారు. ప్రతి నియోజకవర్గంలో ఉన్న చెరువులను నింపే బాధ్యతను, పర్యవేక్షణను ఇరిగేషన్ అధికారులతో పాటు, రెవెన్యూ అధికారులకు కూడా అప్పగించినట్లు రామానాయుడు పేర్కొన్నారు. ఇందులో భాగంగా అక్కడున్న కలెక్టర్లు, తహసిల్దార్లు, వీఆర్వోలు వరకు ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు అవుతారని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆనంద సమయంలో రాయలసీమ ప్రజలు గత ప్రభుత్వ పనితీరుకు, కూటమి ప్రభుత్వ పనితీరుకు మధ్య వ్యత్యాసాన్ని గమనించాలన్నారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో సినిమా సెట్టింగులు, అద్దె ట్యాంకర్లు, అద్దె గేట్లు, బెంగళూరు నుంచి పూలు తెప్పించి నీటి వనరుల ప్రారంభోత్సవాలు నిర్వహించిన సంగతి, జగన్ హెలికాప్టర్ ఎక్కే సమయానికి ఆ నీరు ఆవిరి అయిపోయిన సంగతి అందరికీ గుర్తుండే ఉంటుందని మంత్రి నిమ్మల ఎద్దేవా చేశారు. రాయలసీమ ముద్దుబిడ్డనని చెప్పుకునే జగన్ రాయలసీమ ప్రాజెక్టులకు తీరని ద్రోహం చేశాడని రామానాయుడు విమర్శించారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పింది చేస్తున్నారు. చేసిందే చెబుతున్నారు. వాస్తవాలన్నీ ప్రజలు కళ్ళారా చూసే విధంగా ఈ ప్రభుత్వ పనితీరు పారదర్శకంగా ఉన్న సంగతి గమనించాలని రామానాయుడు విజ్ఞప్తి చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టు రెండోదశగా మడకశిర బ్రాంచ్ కాలువ పనులు అన్నీ పూర్తి చేసి హిందూపురం, మడకశిర, పెనుగొండ నియోజవర్గాలకు నీరుస్తామన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి 400 కిలోమీటర్ల నుంచి 554 కిలోమీటర్ల వరకు అంటే అడివిపల్లి రిజర్వాయర్ నుంచి నీవా, అక్కడ నుంచి తిరుపతి కళ్యాణి డ్యామ్ వరకు అతి త్వరలో నీరు తీసుకెళ్లాలనేది ముఖ్య మంత్రి ఆశయంగా రామానాయుడు స్పష్టం చేశారు. తద్వారా రాయలసీమను రతనాల సీమ చేయాలని కూటమిలోని తెలుగుదేశం, జనసేన, భాజపా పార్టీ లు కృత నిశ్చయంతో ఉన్నట్లు మంత్రి మరోసారి చెప్పారు. ఈసమీక్ష సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, ప్రాజెక్టు సిఈలు కబీర్ భాషా నాగరాజు, ఎస్ఈలు, ఈఈలు, మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పల్లె పండగ 2.0తో గ్రామాల రూపురేఖలు మార్చేయాలి

చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తొలి దశలో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని, రెండో దశ కార్యక్రమాలు అంతకుమించి విజయవంతమయ్యేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పల్లె పండగ మొదటి దశ స్ఫూర్తిని కొనసాగిస్తూ, రెండో దశ ప్రణాళికలు రాష్ట్రంలోని పల్లెసీమల రూపురేఖలను సమూలంగా మార్చే విధంగా ఉండాలి" అని దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఓఎస్డీ వెంకటకృష్ణ, ఇంజనీరింగ్ చీఫ్ బాలు నాయక్ సహా పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. పల్లె పండగ 2.0 అమలుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు.

# ‘వికసిత భారత్’కు ఇది ఊతమిస్తుంది : ప్రధాని

## గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటనపై ప్రధాని మోదీ హర్షం

న్యూఢిల్లీ అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో టెక్ దిగ్గజం గూగుల్ తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది ‘వికసిత భారత్’ నిర్మాణ దార్శనికతకు అనుగుణంగా ఉందని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టుపై గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’లో చేసిన పోస్టుకు ప్రధాని మోదీ మంగళవారం బదులిచ్చారు. “చైతన్యవంతమైన నగరం విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్ ప్రారంభించడం పట్ల చాలా సంతోషంగా ఉంది” అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. గిగావాట్-స్థాయి డేటా సెంటర్ మౌలిక సదుపాయాలతో కూడిన ఈ భారీ పెట్టుబడి, సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంలో శక్తివంతమైన చోదకశక్తిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది ‘అందరికీ ఏఐ’ని అందిస్తుందని, పౌరులకు అత్యాధునిక సాధనాలను అందుబాటులోకి తెస్తుందని తెలిపారు. తద్వారా మన డిజిటల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతమై, ప్రపంచ టెక్నాలజీ లీడర్‌గా భారత్ స్థానం సుస్థిరమవుతుందని ప్రధాని మోదీ అన్నారు. అంతకుముందు, ప్రధాని మోదీతో మాట్లాడటం గొప్ప అనుభూతినిచ్చిందని సుందర్ పిచాయ్ తెలిపారు.



“విశాఖపట్నంలో గూగుల్ మొట్టమొదటి ఏఐ హబ్ ఏర్పాటు ప్రణాళికలను ఆయనతో పంచుకున్నాం. ఇది ఒక చరిత్రాత్మక అభివృద్ధి” అని పిచాయ్ పేర్కొన్నారు. ఈ హబ్‌లో గిగావాట్-స్థాయి కంప్యూట్ సామర్థ్యం, కొత్త అంతర్జాతీయ సబ్‌సీ గేట్‌వే, భారీ ఇంధన మౌలిక సదుపాయాలు ఉంటాయని ఆయన వివరించారు. దీని ద్వారా తమ అత్యాధునిక టెక్నాలజీని భారతీయ సంస్థలకు, వినియోగదారులకు అందించి, దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలను వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం గూగుల్ రాబోయే ఐదేళ్లలో (2026-2030) సుమారు 15 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనుంది. భారత్‌లో గూగుల్ పెడుతున్న అతిపెద్ద పెట్టుబడి ఇదే కావడం విశేషం. అదానీకానెక్స్, ఎయిర్‌టెల్ వంటి ప్రముఖ భాగస్వాములతో కలిసి ఈ డేటా సెంటర్ క్యాంపస్‌ను నిర్మించనున్నారు. ఢిల్లీలో జరిగిన ‘భారత్ ఏఐ శక్తి’ కార్యక్రమంలో ఈ ప్రకటన చేశారు. విశాఖలో ఏర్పాటు చేయబోయే ఈ ఏఐ హబ్, భారతదేశ డిజిటల్ భవిష్యత్తులో ఒక మైలురాయి లాంటిదని గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ అన్నారు.

# కాకినాడ సెజ్ అవార్డు భూములు తిరిగి రైతులకే రిజిస్ట్రేషన్

- రిజిస్ట్రేషన్ రుసుములు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు
- ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఇచ్చిన హామీకి కార్యరూపం
- గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారితో ప్రత్యేకంగా చర్చించిన శ్రీ పవన్ కళ్యాణ్




అమరావతి, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలోని భూములను తిరిగి రైతులకు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీను ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు నిలబెట్టుకున్నారు. సెజ్ పరిధిలోని 2,180 ఎకరాల భూములకు స్టాంప్, రిజిస్ట్రేషన్ డ్యూటీలను మినహాయించి తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసేలా శ్రీ పవన్ కళ్యాణ్ గారు చొరవ తీసుకొని ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించారు. దీంతో కాకినాడ తీరంలోని తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి మండలాల పరిధిలో సుమారు 1,551 మంది రైతులకు మేలు జరగనుంది. కాకినాడ సెజ్ రైతుల సమస్యలను గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి దృష్టికి ఉప ముఖ్యమంత్రివర్యులు ప్రత్యేకంగా తీసుకువెళ్లారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ కాకినాడ సెజ్ రైతులకు ఊరట కలిగించిన కూటమి ప్రభుత్వం. కాకినాడ సెజ్ కు భూములు ఇచ్చిన భూముల్లో 2,180 ఎకరాలను తిరిగి రైతులకు ఇచ్చివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు కాకినాడ సెజ్ లో అవార్డు భూములను తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలిచ్చారు. ఈ రిజిస్ట్రేషన్ లకు రిజిస్ట్రేషన్ రుసుములు, స్టాంప్ డ్యూటీలు వసూలు చేయకూడదని ఆదేశాలలో పేర్కొన్నారు. ఉప్పాడ కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో ఈ భూములు ఉన్నాయి. కాకినాడ సెజ్ పరిధిలో రైతులకు వెనక్కి ఇచ్చిన భూమి, తిరిగి వారి పేరు మీద రిజిస్ట్రేషన్ కాక సతమతం అవుతున్న విషయంపై దృష్టి సారించిన శ్రీపవన్ కళ్యాణ్ గారు గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సరిచేస్తూ రైతులకు న్యాయం చేశారు. గత ప్రభుత్వంలో కాకినాడ సెజ్ భూములపై జీవో నెం.12 విడుదల అయినా క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు మేలు జరగలేదు. వారి పేరున రిజిస్ట్రేషన్లు జరగలేదు. దీంతో పిల్లలకు పెళ్లిళ్లు, చదువుల నిమిత్తం భూములు ఉపయోగపడటం లేదని రైతులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి గతంలో నివేదించారు. దీనిపై పూర్తి వివరాలు పరిశీలించి, రైతులకు మేలు జరిగేలా చూస్తానని శ్రీ పవన్ కళ్యాణ్ గారు అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ సమస్యను ఇటీవల శాసన మండలిలో సమావేశాల్లో ప్రభుత్వ విప్ శ్రీ పిడుగు హరిప్రసాద్ గారు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. రైతుల పడుతున్న ఇబ్బందులను సభలో ప్రస్తావించారు. భూములు రైతుల పేరిట రిజిస్ట్రేషన్ కాకపోవడంతో రైతు భరోసా వంటి పథకాల లబ్ధి అందడం లేదని, బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికీ వీలు లేకుండా పోయిందని రైతుల వ్యథను సభ ముందుంచారు. దీంతో ఈ సమస్య మరోసారి చర్చనీయాంశం అయ్యింది. మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వం కాకినాడ సెజ్ రైతులకు స్టాంప్, రిజిస్ట్రేషన్ డ్యూటీలను మినహాయించి తిరిగి రైతుల భూములు రైతులకు తిరిగి రిజిస్ట్రేషన్ చేసేలా ఆదేశాలు విడుదలయ్యాయి. కాకినాడ సెజ్ రైతులకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకున్నందుకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారికి, రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ అనగాని సత్యప్రసాద్ గారికి ఉప ముఖ్యమంత్రివర్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# భారత్‌లో మసకబారుతున్న సూర్యుడు..

## సౌరశక్తి లక్ష్యాలకు కాలుష్యం దెబ్బ!

- దేశవ్యాప్తంగా గణనీయంగా తగ్గుతున్న సూర్యరశ్మి గంటలు
- వాయు కాలుష్యం, మేఘాలే ప్రధాన కారణమని వెల్లడి
- ఆరుగురు భారత శాస్త్రవేత్తల అధ్యయనంలో కీలక విషయాలు
- సౌరశక్తి ఉత్పత్తి, వ్యవసాయ రంగాలపై తీవ్ర ప్రభావం
- ఉత్తర, పశ్చిమ భారతంలో పరిస్థితి మరింత ఆందోళనకరం



సౌరశక్తి రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్న భారతదేశానికి ఒక కొత్త సవాలు ఎదురవుతోంది. గత మూడు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా సూర్యరశ్మి భూమిని తాకే సమయం (ఎండ గంటలు) క్రమంగా తగ్గుతున్నట్లు భారత శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో వెల్లడైంది. వాయు కాలుష్యం, మేఘాలు, స్థానిక వాతావరణ పరిస్థితులే ఈ మార్పునకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ఈ పరిణామం దేశ సౌరశక్తి లక్ష్యాలతో పాటు వ్యవసాయ రంగంపైనా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగురు భారతీయ శాస్త్రవేత్తలు కలిసి నిర్వహించిన ఈ అధ్యయన వివరాలు ప్రఖ్యాత ‘సైంటిఫిక్ రిపోర్ట్స్’ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. బనారస్ హిందూ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ, భారత వాతావరణ శాఖకు చెందిన శాస్త్రవేత్తలు 1988 నుంచి 2018 మధ్య కాలంలో దేశంలోని 20 వాతావరణ కేంద్రాల నుంచి సేకరించిన డేటాను విశ్లేషించారు. ఈశాన్య రాష్ట్రాల్లో స్వల్ప మినహాయింపులు ఉన్నప్పటికీ, దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో ఏటా సూర్యరశ్మి గంటలు తగ్గుతున్నట్లు ఈ పరిశోధనలో తేలింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలోని అమృత్‌సర్, కోల్‌కతా వంటి నగరాలతో పాటు, హిమాలయ ప్రాంతాలు, ముంబై వంటి పశ్చిమ తీర ప్రాంతాల్లో ఈ తగ్గుదల అత్యధికంగా ఉన్నట్లు గుర్తించారు. గాలిలో తేలియాడే అతి సూక్ష్మ ధూళి కణాలు (ఏరోసోల్స్) ఈ సమస్యకు మూల కారణంగా ఉన్నాయి. పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే పొగ, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వాతావరణంలోకి చేరే ఈ కణాలు సూర్యరశ్మిని నేరుగా భూమిని చేరకుండా అడ్డుకుంటున్నాయి. “ఈ ఏరోసోల్స్ వల్ల మేఘాలు ఎక్కువసేపు వర్షించకుండా నిలిచిపోతున్నాయి. ఫలితంగా అవి సూర్యరశ్మిని మరింతగా అడ్డుకుంటున్నాయి” అని అధ్యయన బృందంలోని బనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోజ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ పరిస్థితి దేశ సౌర విద్యుత్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఐఐటీ కాన్పూర్ శాస్త్రవేత్త సచ్చిదా నంద్ త్రిపాఠి ప్రకారం, వాయు కాలుష్యం కారణంగా సోలార్ ప్యానెళ్ల సామర్థ్యం ఇప్పటికే గరిష్ఠంగా 41% వరకు తగ్గుతోంది. దీనివల్ల ఏటా 245 మిలియన్ల నుంచి 835 మిలియన్ డాలర్ల మేర విద్యుత్ ఉత్పత్తికి నష్టం వాటిల్లుతోంది. ఇదే సమయంలో దేశంలోని అత్యంత కలుషిత ప్రాంతాల్లో వరి, గోధుమ వంటి పంటల దిగుబడి 36% నుంచి 50% వరకు పడిపోవడానికి కూడా ఈ కాలుష్యమే కారణమని ఆయన వివరించారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలన్న భారత్ లక్ష్యానికి తగ్గుతున్న సూర్యరశ్మి గంటలు పెద్ద అడ్డంకిగా మారే అవకాశం ఉంది. ప్రపంచంలోని ఇతర దేశాలైన యూరప్, చైనాలు కూడా గతంలో ఇలాంటి సమస్యను ఎదుర్కొన్నాయి. అయితే కఠినమైన కాలుష్య నియంత్రణ చట్టాల ద్వారా యూరప్ ఈ సమస్యను అధిగమించి మళ్లీ సూర్యరశ్మిని పొందగలిగింది. భారత్ కూడా కాలుష్యాన్ని నియంత్రించడంలో విఫలమైతే, సౌరశక్తి ప్రణాళికలు నీరుగారిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# తక్కువ డోస్‌తో ఎక్కువ ప్రభావం చూపించే కొత్త యాంటీబయోటిక్

**ప్రమాదకరమైన పేగు ఇన్‌ఫెక్షన్‌పై ఈవీజీ7 అనే కొత్త యాంటీబయాటిక్ విజయం**


**అతి తక్కువ డోసుతోనే ‘సి. డిఫిసిల్’ బ్యాక్టీరియా నిర్మూలన**

**ఇన్‌ఫెక్షన్ మళ్లీ రాకుండా నివారించడంలో అద్భుత ఫలితాలు**

**ఆరోగ్యానికి మేలు చేసే బ్యాక్టీరియాను కాపాడుతున్న కొత్త ఔషధం**

**ఎలుకలపై జరిపిన పరిశోధనల్లో కీలక విషయాలు వెల్లడి**

**యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ ప్రమాదం కూడా తక్కువేనన్న పరిశోధకులు**



వైద్య శాస్త్రంలో ఒక కొత్త అధ్యయనం కీలక ఆవిష్కరణకు దారితీసింది. పేగుల్లో తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌కు కారణమయ్యే ‘సి. డిఫిసిల్’ అనే ప్రమాదకరమైన బ్యాక్టీరియాను అతి తక్కువ మోతాదులో యాంటీబయాటిక్ వాడి నియంత్రించవచ్చని పరిశోధకులు కనుగొన్నారు. ఈవీజీ7 (EVG7) అనే ఈ కొత్త యాంటీబయాటిక్, కేవలం చిన్న డోసుతోనే ఈ బ్యాక్టీరియాను సమర్థవంతంగా నాశనం చేయడమే కాకుండా, ఇన్‌ఫెక్షన్ మళ్లీ తిరగబెట్టకుండా నివారిస్తున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది.

**ఏమిటీ సి. డిఫిసిల్ ఇన్‌ఫెక్షన్?**

‘సి. డిఫిసిల్’ అనేది పేగుల్లో నివసించే ఒక మొండి బ్యాక్టీరియా. ముఖ్యంగా వయసు పైబడిన వారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఇది తీవ్రమైన అనారోగ్యానికి కారణమవుతుంది. ఈ బ్యాక్టీరియా విడుదల చేసే ఒక విష పదార్థం వల్ల తీవ్రమైన డయేరియా వస్తుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సలతో ఇన్‌ఫెక్షన్ తగ్గినా, తరచుగా మళ్లీ తిరగబెట్టడం ఒక పెద్ద సమస్యగా ఉంది. “ప్రస్తుత యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేసిన కొన్ని వారాలకే ఈ ఇన్‌ఫెక్షన్ మళ్లీ బయటపడుతుంది. ఎందుకంటే ఈ బ్యాక్టీరియా తన వెనుక ‘స్పోర్’లను వదిలి వెళుతుంది. ఈ స్పోర్‌లు అనుకూల పరిస్థితుల్లో తిరిగి కొత్త బ్యాక్టీరియాగా మారి ఇన్‌ఫెక్షన్‌కు కారణమవుతాయి” అని ఈ పరిశోధన బృందానికి నేతృత్వం వహించిన ఎల్మా మాన్స్ వివరించారు.

**కొత్త యాంటీబయాటిక్ ఎలా పనిచేస్తుంది?**

పరిశోధకులు ఎలుకలపై ఈవీజీ7 యాంటీబయాటిక్‌ను తక్కువ మోతాదులో ప్రయోగించి చూశారు. ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. తక్కువ డోసు ఈవీజీ7 తీసుకున్న ఎలుకలలో ‘సి. డిఫిసిల్’ ఇన్‌ఫెక్షన్ మళ్లీ వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గాయి. ఆశ్చర్యకరంగా, ఇదే యాంటీబయాటిక్‌ను ఎక్కువ డోసులో వాడినప్పుడు గానీ, ప్రస్తుతం వాడుకలో ఉన్న వాంకోమైసిన్‌ను తక్కువ డోసులో వాడినప్పుడు గానీ ఇలాంటి ఫలితాలు రాలేదు.

**దీనికి గల కారణాన్ని పరిశోధకులు విశ్లేషించారు. తక్కువ డోసు ఈవీజీ7,**

ప్రమాదకరమైన ‘సి. డిఫిసిల్’ బ్యాక్టీరియాను చంపుతూనే, మన ఆరోగ్యానికి మేలు చేసే ‘లాక్నోస్పిరేసి’ కుటుంబానికి చెందిన మంచి బ్యాక్టీరియాను మాత్రం కాపాడుతోంది. “ఈ మంచి బ్యాక్టీరియానే ‘సి. డిఫిసిల్’ నుంచి మనకు రక్షణ కల్పిస్తుంది” అని మాన్స్ తెలిపారు. ఈ మేలు చేసే బ్యాక్టీరియా పేగుల్లో ఉండటం వల్ల, మిగిలిపోయిన స్పోర్‌లు తిరిగి పెరగకుండా అడ్డుకుంటున్నాయి. సాధారణంగా తక్కువ డోసు యాంటీబయాటిక్స్ వాడటం వల్ల బ్యాక్టీరియాలో నిరోధక శక్తి (రెసిస్టెన్స్) పెరుగుతుందని భావిస్తారు. అయితే, ఈవీజీ7 తక్కువ డోసు కూడా ‘సి. డిఫిసిల్’ను పూర్తిగా చంపేస్తుండటంతో రెసిస్టెన్స్ ప్రమాదం కూడా తక్కువేనని పరిశోధకులు చెబుతున్నారు. “బ్యాక్టీరియాను పూర్తిగా చంపకుండా, కేవలం దాన్ని ఇబ్బంది పెట్టినప్పుడే అది మరింత బలంగా తయారై రెసిస్టెన్స్ పెంచుకుంటుంది” అని మాన్స్ పేర్కొన్నారు. ఈ కొత్త చికిత్సా విధానం భవిష్యత్తులో ‘సి. డిఫిసిల్’ వంటి మొండి ఇన్‌ఫెక్షన్ల నియంత్రణలో కీలక పాత్ర పోషించగలదని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు

## జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు భద్రతా ప్రమాణాలపై

# ప్రత్యేక దృష్టి పెట్టాలి..

**ప్రమాద నివారణకు సమగ్ర చర్యలు%-%మాక్ డ్రిల్లులు, భద్రతా మాన్యువల్ తప్పనిసరి.**

**ఫ్యాక్టరీలు భద్రతా ప్రమాణాలు పర్యవేక్షణ వ్యవస్థ, నోడల్ ఏజెన్సీస్లు ఏర్పాటు చెయ్యాలి.**

**జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...**

ఏలూరు, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్థాయా పారిశ్రామిక భద్రతా కమిటీ మరియు క్రైసిస్ గ్రూపులు కమిటీ సమావేశాన్ని ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్, సేఫ్టీ అధికారులతో కలసి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో ఏ కేటగిరి 04, బి 1 కేటగిరి 26, బి2 కేటగిరి 06 మొత్తం 36 పరిశ్రమలు మీద భద్రత ప్రమాణాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఫ్యాక్టరీకి తప్పనిసరిగా భద్రతా అధికారిని నియమించి, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలను అమలు చేసి రొటీన్ గా మాక్ డ్రిల్‌లు నిర్వహించాలన్నారు. భద్రతా వృత్తాలు, జోన్లు ఏర్పాటు చెయ్యాలని, ప్రజలు కూడా ప్రమాదాలు జరిగే సమయంలో అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. వార్షిక భద్రతా శిక్షణ క్యాలెండరు, భద్రతా మాన్యువల్, భద్రతా బుక్‌లెట్ ద్వారా కార్మికులకు అవగాహన కల్పించడం, భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించడం జరగాలన్నారు. ఎమర్జెన్సీ అలారం సిస్టమ్ సజావుగా పనిచేయడం, సెన్సర్ యాక్టివేషన్ ద్వారా జిల్లా అధికారులను అప్రమత్తం చేయడం వంటి అంశాలను పగడ్బందీగా అమలు చెయ్యాలని ఆదేశించారు. భద్రతా చర్యలుపై ప్రతి ఫ్యాక్టరీ 30 రోజుల్లోగా పూర్తి నివేదికను సమర్పించాలని, ఈ నెలలో ప్రతి ఫ్యాక్టరీలో మాక్ డ్రిల్ ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. ఇందులో ఆన్-సైట్ మరియు ఆఫ్-సైట్ భద్రతా చర్యలు, మాక్ డ్రిల్ ఫలితాలు, హెచ్చరిక వ్యవస్థ పనితీరుపై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి నివేదికలు అందజేయాలన్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే ఆటోమేటిక్ అలారం మరియు ఎస్ ఎమ్ ఎస్ సిస్టమ్ ద్వారా సంబంధించిన అధికారులు వెంటనే అప్రమత్తం కావలసిన వ్యవస్థను ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమలు కేంద్రం జియం పి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, జిల్లా పరిశ్రమలు తనిఖీ అధికారి కె. కృష్ణమూర్తి, ఐటిడిఏ పివో కె. రాములు నాయక్, ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కె.వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పి.జె. అమృతం, జిల్లా స్కిల్ డెవలప్మెంటు అధికారి యన్.జితేంద్రబాబు, జిల్లా మత్స్యశాఖ డిడి బి.నర్సయ్య, జిల్లా ట్రాన్స్ పోర్టు అధికారి యస్.బి. శేఖరు, వివిధ శాఖల అధికారులు, వివిధ పరిశ్రమలు సేఫ్టీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

గడపరాయిలో త్రాగునీటి ట్యాంక్

# నిర్మాణ పనులు ప్రారంభం

**జలజీవన్ మిషన్ పథకంలో రూ.10 లక్షల నిధులతో పనులు ప్రారంభించిన సర్పంచ్ పుష్పలత.**







**చింతపల్లి, అక్టోబర్ 14 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** గ్రామ ప్రజలకు శుద్ధమైన త్రాగునీటి సౌకర్యం కల్పించాలన్న సంకల్పంతో చింతపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని గడపరాయి గ్రామంలో త్రాగునీటి ట్యాంక్ నిర్మాణ పనులు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాల జలజీవన్ మిషన్ పథకం కింద సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. ఈ పనులకు చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుష్పలత మాట్లాడుతూ ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు అందించడమే జలజీవన్ మిషన్ ప్రధాన లక్ష్యం. గ్రామాభివృద్ధి దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రోజురోజుకు జనాభా పెరుగుతున్న తరుణంలో ప్రాథమిక సౌకర్యాల విస్తరణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం అని తెలిపారు. 10 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత త్రాగునీటి ట్యాంక్ గ్రామ ప్రజల అవసరాలను తీర్చగలదని పేర్కొన్నారు. పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ సర్పంచ్ పుష్పలత కృషి ఫలితంగా గ్రామానికి ఎంతో అవసరమైన త్రాగునీటి సదుపాయం లభించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కిముదు కృష్ణమూర్తి, అప్పారావు, నీటిపారుదల శాఖ జేఈ జి. స్వర్ణలత, వైకాపా రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, కూటమి నాయకులు రుత్తల సత్యనారాయణ, షేక్ కాసిం వల్లి, అశోక్, వైకాపా నాయకులు కృష్ణ, లోవరాజు, శ్రీను, గంగన్నపడాల్ పాల్గొన్నారు.

ప్రతి దుకాణంలో

# జీఎస్టీ బోర్డులు ఏర్పాటు చేయాలి..!

**చింతపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనందరావు పిలుపు.**



**చింతపల్లి, అక్టోబర్ 14 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** ప్రజలకు పారదర్శకంగా ధరలు తెలియజేయడం ప్రతి వ్యాపారిదీ బాధ్యత అని చింతపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు అన్నారు. దుకాణాల వద్ద వస్తువులకు అనుగుణంగా అమలులో ఉన్న జీఎస్టీ రేట్లను స్పష్టంగా ప్రదర్శించే బోర్డులు ఏర్పాటు చేయడం తప్పనిసరి చేయాలని ఆయన సూచించారు. మంగళవారం పార్టీ కార్యకర్తలతో కలిసి చింతపల్లి పట్టణంలోని వివిధ దుకాణాలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక వస్తువులపై జీఎస్టీ శాతాన్ని తగ్గించింది. కానీ చాలామంది వ్యాపారులు ఈ తగ్గింపుల సమాచారాన్ని ప్రజలకు తెలియజేయడం లేదు. బోర్డులు లేకపోవడం వల్ల వినియోగదారులు ఎంత పన్ను చెల్లిస్తున్నారో స్పష్టత లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్టీ తగ్గింపులు అమల్లోకి వచ్చినప్పటికీ కొందరు వ్యాపారులు పాత ధరలకే విక్రయాలు కొనసాగిస్తున్నారని ఆయన విమర్శించారు. వినియోగదారులను తప్పుదారి పట్టించే అలవాట్లు మానుకోవాలి. పారదర్శకతే నమ్మకం తెస్తుంది. ప్రతి షాపు ముందు జీఎస్టీ వివరాలు చూపే బోర్డు ఏర్పాటు చేయకపోతే, సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తాం అని హెచ్చరించారు. ప్రజలే ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. వారు సరైన ధరకు సరుకులు పొందేలా చూడటం వ్యాపారుల కర్తవ్యం. తగ్గించిన పన్ను ప్రయోజనాలు నేరుగా వినియోగదారులకే చేరాలి. దీనిపై మేము నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తాం అని తెలిపారు. జీఎస్టీ బోర్డులు ఉంటే వినియోగదారులకు ఎంత పన్ను పడుతోందో స్పష్టత వస్తుందని, దుకాణదారులు కూడా అవగాహనతో వ్యవహరిస్తే రెండు పక్షాలకు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రుత్తల సత్యనారాయణ, అప్పారావు, కాసిం వల్లి, గాంధీ పడాల్, అలాగే టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా టి నరసాపురం మండలంలో

# క్రాకర్స్ దుకాణాలపై భద్రతా తనిఖీలు...

**ఏలూరు, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ వారు రాబోయే పండుగల సందర్భంగా ప్రజల భద్రత ను దృష్టిలో ఉంచుకుని పోలవరం డీఎస్పీ శ్రీ ఎం. వెంకటేశ్వరరావు ఆదేశాలపై, టి నరసాపురం ప్రాంతంలో క్రాకర్స్ దుకాణాలపై విస్తృత తనిఖీలు నిర్వహించారు, ఈ తనిఖీ బృందంలో జీలుగుమిల్లి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, టి. నరసాపురం ఎస్ ఐ జయ బాబు, ఎంఆర్ఓ (తహశీల్దార్), పంచాయతీ కార్యదర్శి, మరియు అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు, లైసెన్స్ పొందిన అగ్ని పటాకుల దుకాణాలను ఈ బృందం సంయుక్తంగా తనిఖీ చేసి, అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై యజమానులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది, భద్రతా సూచనలు మరియు ఆదేశాలు అధికారులు దుకాణ యజమానులకు జారీ చేసిన ముఖ్య సూచనలు మరియు ఆదేశాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: చెల్లుబాటు అయ్యే లైసెన్స్ ఉన్న దుకాణాలకే అమ్మకాలకు అనుమతి ఉంటుంది, బాణా సంచా దుకాణాలు నివాస గృహాలు, పాఠశాలలు (స్కూల్స్), పెట్రోల్



బంకుల నుండి కనీసం 50 మీటర్ల దూరంలో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి, బాణా సంచా దుకాణాల నిర్మాణం అగ్ని నిరోధక పదార్థాలతో (టిన్/ఆస్బెస్టాస్ షీట్లు) మాత్రమే చేయాలి, ప్రతి బాణా సంచా దుకాణంలో నీరు, ఇసుక బిందెలు (Sand Buckets) మరియు ఫైర్ ఎక్స్టింగ్విషర్ తప్పనిసరిగా సిద్ధంగా ఉంచాలి, బాణా సంచా దుకాణాల వద్ద ధూమపానం, దీపాలు వెలిగించడం మరియు మొబైల్ వాడకం పూర్తిగా నిషేధం, బాణా సంచా దుకాణంలో ఉపయోగించే విద్యుత్ వైరింగ్ సురక్షితంగా మరియు ప్రమాద రహితంగా ఉండాలి, బాణా సంచా లైసెన్స్ ప్రకారం మాత్రమే పరిమిత పరిమాణంలో పటాకులు నిల్వ చేయాలి, రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి విక్రయాలు చేయరాదు, వినియోగదారులకు బాణా సంచా వాడేటప్పుడు తీసుకోవాల్సిన భద్రతా సూచనలు తప్పనిసరిగా తెలియజేయాలి, అత్యవసర నంబర్లు (ఫైర్, పోలీస్, రెవెన్యూ) స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలి, చిన్నపిల్లలకు పెద్దవారి పర్యవేక్షణ లేకుండా పటాకులు అమ్మరాదు, అగ్నిమాపక శాఖ అధికారులు అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి ట్యాంకర్లు (%ఖీఱతీవ ఎవఅఐవతీం%) మరియు సిబ్బందిని నిరంతరం సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు, పోలీసు, రెవెన్యూ మరియు ఫైర్ డిపార్ట్మెంట్ల సమన్వయంతో నిర్వహించిన ఈ తనిఖీలు, పండుగల సందర్భంగా ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడంలో ఏలూరు జిల్లా యంత్రాంగం యొక్క నిబద్ధతను తెలియజేస్తున్నాయి, ఎవ్వరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్‌తో సామాన్యులకు మేలు




**కొత్తపేట, అక్టోబర్ 14:( తెలుగు రాష్ట్రం )** సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌తో సామాన్య ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీఎస్టీ 2.0 అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. జీఎస్టీ 2.0 పేద, మధ్యతరగతి వర్గాల పాలిట వరమని పేర్కొన్నారు. కొత్త పన్ను విధానం వల్ల రాష్ట్రానికి సుమారు రూ.8 వేల కోట్ల ఆదాయం తగ్గినా, ప్రజలకు ఆ మేరకు లాభం చేకూరుతుందని తెలిపారు. ప్రజలకు జీఎస్టీ 2.0 ప్రయోజనాలు చేరాలనే సదుద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో అమల్లో ఉన్న 5%, 8%, 12%, 18%, 28% వంటి ఐదు రకాల స్లాబులు తొలగించి, ఇప్పుడు కేవలం 5% మరియు 18% స్లాబులు మాత్రమే అమల్లో ఉన్నాయని వివరించారు. అత్యధికంగా ఉన్న 28% పన్ను శ్రేణి పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన పాలు, పన్నీరు, డ్రిప్, బయో పెస్టిసైడ్స్, యంత్ర పరికరాలపై పన్ను భారీగా తగ్గడంతో వాటి ధరలు గణనీయంగా తగ్గాయని వివరించారు. కృషి ట్రాక్టర్‌పై రూ.16,500 వరకు, టెలివిజన్లపై రూ.3,500 వరకు, చిన్న కార్లపై రూ.70 వేల వరకు ధరలు తగ్గుతున్నాయని తెలిపారు. అదే విధంగా సెలూన్లు, బ్యూటీపార్లర్లు, స్పా వంటి సేవలపై పన్ను 5 శాతానికి తగ్గడంతో ఏడాదికి ప్రతి కుటుంబానికి సుమారు రూ.8,500 ఆదా అవుతుందని చెప్పారు. మధ్యతరగతి కుటుంబం ఒక మోటార్‌సైకిల్ కొనుగోలు చేసినా రూ.8 వేల వరకు తగ్గుతుందని వివరించారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ఫలితాలు సామాన్యులకు చేరాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్దేశమని ఆయన అన్నారు. తగ్గిన జీఎస్టీ రేట్లు వినియోగదారులకు చేరకపోతే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అధికారులు పర్యవేక్షణతో జీఎస్టీ 2.0 సక్రమంగా అమలయ్యేలా చూడాలని సూచించారు.కొత్తపేట కొత్తపేటలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం ఉత్సాహంగా అధికారులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హెచ్చరిక – “అధిక వసూళ్లపై కఠిన చర్యలు తప్పవు” ఈ కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బి. వెంకటేశ్వరరావు, కొత్తపేట గ్రామ సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు, వానపల్లి గ్రామ సర్పంచ్ పల్లి భీమారావు, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మిద్దె ఆదినారాయణ, ఎండీఓ నరేష్, ముత్యాల బాబ్జి, గనిశెట్టి వీరేష్, కంఠం శెట్టి శ్రీనివాస్, పాలూరు సత్యానందం, ఎన్డీఏ కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## గూగుల్ రాక రాష్ట్ర చరిత్రలో మైలురాయి

**ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**




**కొత్తపేట, అక్టోబర్ 14 ( తెలుగు రాష్ట్రం )** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందనే సంకేతం గూగుల్ సంస్థ విశాఖ రాకతో స్పష్టమైందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన ు గూగుల్ రాక రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు సిటీ ఆఫ్ డెస్టినీగా పేరుగాంచిన విశాఖ నగరం, ఇకపై ఏఐ %-% డిజిటల్ సిటీగా మారబోతోందని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో విశాఖలో భూదందాలు, అక్రమాలు విస్తరించాయని, కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం పారదర్శక పాలనతో విశాఖను ఏఐ సిటీగా అభివృద్ధి చేస్తున్నదని తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశానికి డిజిటల్ ఇండియాలో మార్గదర్శక రాష్ట్రంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ అభివృద్ధికి మైక్రోసాఫ్ట్ సంస్థ రాక గేమ్‌చేంజర్‌గా మారినట్లు గుర్తు చేస్తూ, “చంద్రబాబు దూరదృష్టితోనే ఆ టెక్ విప్లవం సాధ్యమైంది. అదే దృష్టితో విశాఖలో రూ.87,500 కోట్ల పెట్టుబడితో గూగుల్ సౌత్ ఏషియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయడం మరో చారిత్రక ఘట్టం” అని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ ఆర్థిక దూరదృష్టి, పారదర్శక విధానాల వల్ల పెట్టుబడిదారులకు విశ్వాసం కల్పించగలిగారని, భూముల కేటాయింపు నుంచి పవర్ సప్లై వరకు సింగిల్ విండో క్లియరెన్స్ ద్వారా సౌకర్యాలు అందుతున్నాయని తెలిపారు. గూగుల్ రాకతో మరెన్నో ఐటీ, టెక్, ఏఐ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తాయని, వేలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని చెప్పారు. దీని ఫలితంగా రవాణా, విద్యుత్, నిర్మాణ రంగాలతో పాటు స్థానిక వ్యాపారాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని వివరించారు. “హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ రాక టెక్ రంగానికి గేమ్‌చేంజర్‌గా మారినట్లే, విశాఖలో గూగుల్ రాక ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు గేమ్‌చేంజర్‌గా నిలుస్తుంది,” అని అన్నారు. నేడు మంత్రి నారా లోకేష్ విశాఖ సాగరతీరంలో డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లకు శంకుస్థాపన చేయడం ద్వారా ఏపీ ఐటీ రంగానికి కొత్త దశ ప్రారంభమైందని తెలిపారు. ఏపీ యువతకు ఐటీ రంగంలో ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐటీ పాలసీ ఫలితంగానే గూగుల్, యాక్సెంచర్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల బాబ్జి, కొత్తపేట మండల పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, బూసి భాస్కరరావు, ధర్నాల రామకృష్ణ, పల్లి ఏసు, సురవరపు రామకృష్ణ, బుసి విష్ణు, యలమల్లి జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


## తిరుమల తరహాలో వాడపల్లి అభివృద్ధి - ఎమ్మెల్యే సత్యానందరావు





**ఆత్రేయపురం, అక్టోబర్ 14 ( తెలుగు రాష్ట్రం):** తిరుమల తరువాత తిరుమలలా వాడపల్లి అభివృద్ధి జరుగుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు దంపతులకు దేవస్థానం అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం కళ్యాణమహోత్సవం, హోమాల్లో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుమల వెళ్ళలేని భక్తులు వాడపల్లి వచ్చి స్వామివారి బ్రహ్మోత్సవాలను దర్శించుకునేలా క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వాడపల్లి తిరుమలను తలపించే స్థాయిలో అభివృద్ధి చెందుతోందని, బ్రహ్మోత్సవాలు ప్రపంచానికి స్వామివారి వైభవాన్ని చాటుతున్నాయని పేర్కొన్నారు. కొత్తపేట నియోజకవర్గ ప్రజలు, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు స్వామివారి ఆశీస్సులు తోడవాలని కోరుకున్నట్లు చెప్పారు. క్షేత్రాభివృద్ధిలో భాగంగా రహదారులు, విద్యుత్ దీపాలంకరణ, ఫల%-%పుష్పాలంకరణతో వాడపల్లి దేవస్థానం శోభాయమానంగా మారిందని వివరించారు. భక్తులకు దర్శనం, అన్నప్రసాదం, అల్పాహారం, టాయిలెట్, శానిటేషన్ వంటి సౌకర్యాలు మెరుగుపరచినట్లు తెలిపారు. చంటి బిడ్డల తల్లులు, వృద్ధుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేసి, గతంలో గంటల సమయం పట్టే దర్శనం ఇప్పుడు వేగంగా, సౌకర్యవంతంగా జరుగుతోందన్నారు. వాడపల్లి మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా 90 టాయిలెట్ల నిర్మాణం, రహదారి విస్తరణ, పార్కింగ్ ఏరియా లెవెలింగ్ పనులు పూర్తిచేశామని, వకుళమాత అన్నదాన కేంద్రం త్వరలో పూర్తి కానుందని తెలిపారు. అదనంగా 8 ఎకరాల పార్కింగ్ స్థలం, 54 రూములు, 4 డార్మిటరీలతో కొత్త భవనం నిర్మించనున్నట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరం, రావులపాలెం, జాతీయ రహదారి మార్గాల ద్వారా వాడపల్లికి సులభ రాకపోకల కోసం రహదారుల అభివృద్ధి చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 57 గ్రామాల నుంచి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉచిత బస్సులను ఏర్పాటు చేశామని, భక్తులందరూ తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని పిలుపునిచ్చారు.





# నవంబర్ నుంచి డ్యాం పనులు ప్రారంభం


**పోలవరం, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పోలవరం ప్రాజెక్టులో ప్రధాన రాతి, మట్టి డ్యాం నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. నవంబర్ నుంచి పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో సోమవారం నుంచి డయాఫ్రం వాల్పై ఏర్పాటు చేసిన గైడ్వాల్, ప్లాట్ఫాం తొలగింపు పనులు మొదలయ్యాయి. డిజైన్ ప్రకారం ప్రధాన డ్యాం నిర్మాణానికి అనుగుణంగా గైడ్వాల్ను తొలగిస్తున్నామన్నారు. 800 మీటర్ల నుంచి 850 మీటర్ల మధ్య ప్లాట్ఫాంను తొలగించినట్లు ఇంజనీర్ రామచంద్రరావు తెలిపారు.

# సిపిఆర్ పద్ధతి ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు




**పోలవరం, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పోలవరం మండలం సీహెచ్సీలో మంగళవారం డాక్టర్ ఎండీ కృష్ణరాజు ఆధ్వర్యంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీససిటేషన్) అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణరాజు మాట్లాడుతూ హఠాత్తుగా గుండెపోటు వచ్చినప్పుడు లేదా శ్వాస ఆగినప్పుడు సీపీఆర్ పద్ధతితో ప్రాణాలను రక్షించగలదని తెలిపారు. సాధారణ ప్రజలు కూడా ఈ పద్ధతిని నేర్చుకుంటే అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు.

# పాముకాటుతో అస్వస్థతకు గురైన వ్యవసాయ కూలి



**పోలవరం, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పాముకాటుతో వ్యవసాయ కూలి అస్వస్థతకు గురైన సంఘటన పోలవరం మండలం కొత్త పట్టిసీమ గ్రామానికి చెందిన గంట శివ అనే వ్యక్తి మంగళవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే పట్టిసీమ గ్రామానికి చెందిన గంటా శివ అనే వ్యవసాయ కూలి ఉదయం కూలిపనికి వెళ్ళి పని చేస్తుండగా పాము కరిచి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన స్థానికులు అతనిని పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేం ద్రానికి తరలించగా వైద్యాధికారి కృష్ణంరాజు ప్రథమ చికిత్స అందించి వైద్య సేవలందిం చారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పాము విషం విరుగుడు ఇం జెక్షను అందించి 24 గంటలు అబ్జర్వేషన్లో ఉంచినట్లు తెలిపారు. వర్షాకాలం వలన వ్యవసాయ కూలీలు, రైతులు ఇతరులు పాములు, తేళ్ళు విష కీటకాల పట్ల అప్రమత్తం గా ఉండాలని పాముకాటుకు గురైన వెంటనే సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలని పాముకాటు మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.


# దాతలు ఆదుకోవాలని వినతి



**చింతలపూడి, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం విలేకరి):** చింతలపూడి పట్టణానికి చెందిన భాగ్యరాజు అనే యువకుడు బ్రెయిన్ స్ట్రోక్ తో గత కొంత కాలంగా మంచానికే పరిమితం అయ్యారు. ఒకసారి ఆపరేషన్ చేసారు మళ్ళీ ఆపరేషన్ చేయాలి అని డాక్టర్స్ చెప్పారు. ఆ ఆపరేషన్ కి డబ్బులు లేని పరిస్థితుల్లో ఎవరైనా ఆర్థిక సాయం చేస్తారనే ఆశతో ఉన్నారు. ఆ విషయం తెలుసుకున్న ఆర్ ఎఫ్ ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ 6వేల రూపాయలు భాగ్యరాజు ఇంటికి వెళ్లి ఆయనకి అందించడం జరిగింది. అనంతరం ఆర్ ఎఫ్ ఎస్ సంస్థ అధినేత రవి మాట్లాడుతూ పెద్దమొత్తంలో ఆర్థిక అవసరత ఉంది. ఎవరైనా దాతలు ఈ నెంబరుకి 9618840406 మీ సహాయం అందించాలని కోరారు.

# ఆరోగ్యకరమైన జీవనశైలితోనే సంపూర్ణ ఆరోగ్యం

## ఆరుగొలను సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 14(తెలుగురాష్ట్రం విలేకరి):** ఆరోగ్యకరమైన జీవనశైలితోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఆరుగొలను సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని ఆరుగొలను సొసైటీ ఆవరణలో ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ఆశీస్సులతో, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వారి సౌజన్యంతో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి వీర వెంకట సత్యనారాయణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులతో మెడిసిన్, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, పీడియాట్రిక్స్, దర్మటాలజీ, ఇ.ఎన్.టి, సైకియాట్రిక్, డెంటల్, రేడియాలజీ, ఎక్సరే, ఈసీజీ వంటి వైద్య విభాగాల నిపుణులు ప్రజానీకానికి వైద్య సేవలందించారు. వీటితో పాటు కాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆరుగొలను, దండగర్ర, కొత్తూరు, లింగారాయుడుగూడెం, దండగర్ర, గ్రామ ప్రజలు రైతు సోదర, సోదరీమణులు భారీ ఎత్తున ఎత్తున తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆరుగొలను సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేని పేదలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆశీస్సులతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ప్రత్యేక సేవలందించిన మానవతా సంస్థ, ఆశ్రం ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రైతే రాజు అని, రైతులు ఆరోగ్యవంతంగా ఉంటేనే సొసైటీలు కూడా ప్రగతిపదంలో పయనిస్తాయని చెప్పారు. మానవతా మండల అధ్యక్షులు డి. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పేదరికంలో ఉన్న వారికి అన్నివేళలా సేవ చేయడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. మానవతా ద్వారా పేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, పెన్నులు విద్యా సామాగ్రి ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న ఏ వ్యక్తికైనా తమ సంస్థ ద్వారా స్వచ్ఛందంగా సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 365 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ కెవి రామారావు, నాయకులు అడపా శ్రీనివాస్, మొసళ్ళ నాని, ప్రభాకర్, వీరమల్లు రాంపండు, అడ్డగర్ల మహేష్, పురేటి శ్రీరామ్, గోపిరెడ్డి రాము, కుడవల్లి ధనరాజు, కుడవల్లి రాంబాబు,యు.వి.వి సేన, సొసైటీ కార్యదర్శి గోపిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జిల్లా క్రికెట్ జట్టుకు ముగ్గురు విద్యార్థులు ఎంపిక



**తాడేపల్లిగూడెం, అక్టోబర్14 (తెలుగురాష్ట్రం విలేకరి):** జిల్లా క్రికెట్ జట్టుకు తమ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.నాగవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 19 విభాగం క్రికెట్ పోటీలను ఏలూరులో నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన సుబ్రహ్మణ్యం, మణికంఠ, రెడ్డి తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరు రాష్ట్రం తరపున త్వరలో జరగబోయే క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కళాశాల పేరు, ప్రతిష్టలను ఇనుమడింపజేసిన క్రీడాకారులను, వారికి క్రికెట్లో ప్రత్యేక తర్ఫీదునిచ్చిన వ్యాయామ అధ్యాపకులు మాణిక్యం రాజాకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భోదన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన జెసి అభిషేక్ గౌడ్‌ను కలసిన ఎమ్మెల్యే చిర్రి



**జీలుగుమిల్లి, అక్టోబర్14 (తెలుగురాష్ట్రం విలేకరి):** జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ గా నియామకమైన ఎం.జె. అభిషేక్ గౌడ్ ను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ అయన ఛాంబర్ లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే జెసితో చర్చించారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సేవల మెరుగుదల వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించినట్లు ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు జయవరపు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

# ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం విలేకరి):** పెంటపాడు మండలం పరిమెల్ల గ్రామంలోని పలు డ్రైనేజీల్లో మంగళవారం పూడికతీశారు. వర్షం కురిసినపుడు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు ఎక్కడా నిల్వలేకుండా సాఫీగా ముందుకెళ్లేందుకు వీలుగా ఈ పనుల్ని చేపట్టారు. డ్రైనేజీలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను, పిచ్చి మొక్కలను నరికించారు. గ్రామ కార్యదర్శి డి.నాగదేవి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఈ పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తాచెదారాన్ని డ్రైనేజీల్లో వేయవద్దని గ్రామస్తులకు సూచించారు. మురుగు నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి అనారోగ్యాలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇంటిని ఎలా చూసుకుంటారో పరిసరాలను కూడా అంతే శుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు.






# మండలం పార్టీ అధ్యక్షులకి సన్మానం చేసిన ఎమ్మెల్యే

**కూనవరం, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం విలేఖరి):** కేంద్రం పార్టీ ఆదేశాలు మేరకు నూతనంగా ఎన్నికైన మండలం పార్టీ అధ్యక్షులు చిత్తశుద్ధితో సేవ చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే మరియు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుల సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా వర రామచంద్రపురం మండల పార్టీ అధ్యక్షులు గా బొర్రా నరేష్ ని, కూనవరం మండలపార్టీ అధ్యక్షులు గా ఎడవల్లి భాస్కరరావు లను శాలువాతో సన్మానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదవులు పొందినవారు అందరూ అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. అలాగే సూపర్ జీ ఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం వంద శాతం పూర్తిచేసిన బూట్ ఇంచార్జి హెచ్. రవి ని సన్మానం చేసి గౌరవించారు. పార్టీ కార్యక్రమాల్లో అందరూ మంచిగా సాగాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాన్, మండల పార్టీ అధ్యక్షులు పి. అనంతమోహన్, గురుకుశేషు కుమార్, గోళ్ళ చంటిబాబు, సొసైటీ చైర్మన్ లు మాగపు బాబురావు, సీనియర్ నాయకులు గణజాల తాతారావు, అడబాల బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

## -కలెక్టర్ ని కోరిన ఎమ్మెల్యే, శిరీషదేవి



**ఎటపాక, అక్టోబర్ 14 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** రంపచోడవరం డివిజన్ వ్యాప్తంగా అనేక రకాల మౌళికసమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వాటిని క్రమ పద్దతిలో పరిస్కారం చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే మరియు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి కోరారు. ఈ మేరకు మంగళవారం ఐటీడీఏ కార్యాలయానికి విచ్చేసిన అల్లూరి కలెక్టర్ దినేష్ కుమార్ ని కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజవొమ్మంగి మండలంలో కొన్ని రహదారులు కావాలని, అడ్డతీగల మండలం కొత్తూరు నుండి బందమామిళ్ళు వరకూ రోడ్డు సౌకర్యం మెరుగు పర్చాలని కోరారు. అలాగే విలీన మండలాల గోదావరి ముంపు పై క్షుణ్ణముగా వివరించి సత్వర పరిస్కారం చేయాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న మరియు అటవీ శాఖ అనుమతులు లేక ఇబ్బందిగా గా పలు రహదారులు కొరకు ప్రస్తావించి త్వరిత గతిన చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. సంబంధిత సమావేశంలో ఐటీడీ ఏ పీవో బచ్చు స్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ లకు కూడా కొన్ని పనులు విషయంలో ప్రత్యేక శ్రద్ద పెట్టి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆమె వెంట రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాన్, మారేడుమిల్లి మండల పార్టీ అధ్యక్షులు గురుకు శేషు కుమార్, కర్రి సన్యాసి రెడ్డి, మాజీ సర్పంచ్ వై. నిరంజనీదేవి, జనసేన మారేడుమిల్లి మండల పార్టీ అధ్యక్షులు మళ్ళ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పై అవగాహన ర్యాలీ




**చింతూరు, అక్టోబర్14 (తెలుగురాష్ట్రం విలేకరి):** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం, అర్థశాస్త్ర విభాగం, జాతీయ సేవా విభాగాల ఆధ్వర్యంలో "సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ "పై ప్లకార్డులు, నినాదాలతో ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.రత్న మాణిక్యం మాట్లాడుతూ ప్రతిరోజు కొనుగోలు చేసే వస్తువుల ధరల్లో జీఎస్టి మినహాయింపుపై వినియోగదారులకు అవగాహన కల్పించేలా గ్రామాల్లో విద్యార్థులు చైతన్యం కల్పించాలని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎమ్. శేఖర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల అమలులోకి తెచ్చిన జీఎస్టీ 2.0 వలన ప్రయోజనాలను, వివిధ స్లాబ్స్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.సాయికుమార్, అర్థశాస్త్ర విభాగాధిపతి జి. వెంకట్రావు, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి జి. హారతి, అధ్యాపకులు ఎస్. అప్పనమ్మ, ఆర్. మౌనిక, బి. శ్రీనివాసరావు, ఎన్. ఆనంద్, కె. లక్ష్మి ప్రసన్న అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజకీయ కక్షతోనే సిసి రోడ్లల నిర్మాణం నిలిపివేత





**విఆర్ పురం, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రేఖపల్లి పంచాయతీలో మోడెం నరేష్ ఇంటి నుంచి అంగన్వాడి సెంటర్ వరకు ఉపాధి హామీ పథకం ద్వారా సిసి రోడ్డు నిర్మాణం నాలుగు లక్షల 50 వేల రూపాయలు మంజూరు కాగా, దాని నిర్మాణంలో నిబంధనలు గాలికి వదిలి స్థానిక సర్పంచ్, కాంట్రాక్టర్ పనులు చేస్తున్నారని అట్టి పనులు నిబంధనల ప్రకారం మోడెం నరేష్ ఇంటి నుంచి ప్రారంభించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవోకి స్థానిక గ్రామస్తులు ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో వైసిపి నాయకుడైన మోడెం నరేష్ ఇంటి నుంచి ప్రారంభించడానికి ఇష్టం లేక స్థానిక సర్పంచ్, సిపిఎం చెందిన కాంట్రాక్టర్లు అలా వ్యవహరిస్తున్నారని ఈ విషయాన్ని మేడం నరేష్, గ్రామస్తులు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో లకు ఫిర్యాదు చేస్తామని స్థానిక ప్రజలు తెలిపారు. ఇది మంజూరు అయ్యి 18 నెలల కావస్తుండగా ప్రజలు తిరగాల్సిన రోడ్డుమీద మీ రాజకీయాలా? మీ రాజకీయాలు అభివృద్ధిని ఆపుతారా? ఇదేనా మీ సమన్వయ పాలన? వడ్డి సత్యనారాయణ నుంచి కళ్లి చిన్న ముత్యాలు, కట్టిబొయిన సత్తయ్య నుంచి నూపా నాగేశ్వరావు, సాయిబాబా టెంపుల్ నుంచి రేవు పోసి, ఆర్ అండ్ బి రోడ్ నుంచి రేఖపల్లి బ్యాంకు, వీటికున్న శ్రద్ధ మోడెం నరేష్ ఇంటి నుంచి అంగన్వాడి సెంటర్ వరకు ఎందుకు లేదు? కేవలం రాజకీయ కక్షతో ఈ రోడ్డును నిలిపివేశారా అని అన్నారు. సంబంధిత ఇంజనీరింగ్లు, అధికారులు నిబంధనలు తుంగలో తొక్కి ఒక పార్టీకి కొమ్ము కాయటం మంచిది కాదని స్థానిక ప్రజలు అన్నారు. గతంలో కూడా స్థానిక సర్పంచ్ గ్రామ అభివృద్ధిలో నిక్ష్పక్షంగా వ్యవహరించకుండా తమ పార్టీ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించి పంచాయతీ అభివృద్ధిని కుంటు పారేశారని ఆఖిల పక్ష నాయకులు మోడం నరేష్, ఉయిక రత్తయ్య, మోడెం రాజేష్, ముత్యాల రాంబాబు, మోడెం ప్రశాంతి, కట్టిబోయిన వినోద్ కుమార్, మోడెం వెంకటేష్, మేకల మాధవ రావు తెలియజేశారు.

## జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిసిడిఓ కవిత



**వి ఆర్ పురం, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మంగళవారం నాడు జిసిడిఓ కవిత పరిశీలించారు. పాఠశాలలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ కు సంబందించిన ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ లాబ్స్ ను తనిఖీ చేసారు. అనంతరం విద్యార్ధులకు, ట్రైనర్లకు బోధన అభ్యసన గురించి సూచనలు ఇచ్చారు. పిల్లలకు ఒకేషనల్ విద్య ప్రాముఖ్యత గురించి చెప్పి దసరా సెలవులలో జరిగిన ఇంటర్న్షిప్ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు అజయ్ కుమార్, పాఠశాల సిబంది, ఒకేషనల్ టీచర్స్ నవీన్, వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని హంగులున్న వినోదాత్మక చిత్రం 'కె-రాంప్'

### - రాజమండ్రిలో సందడి చేసిన మూవీ హీరో కిరణ్ అబ్బవరం

**రాజమహేంద్రవరం, అక్టోబర్ 14(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** అన్ని హంగులతో కూడిన వినోదాత్మక చిత్రంగా 'కె - రాంప్' చిత్రం రూపొందిందని చిత్ర హీరో కిరణ్ అబ్బవరం చెప్పారు. సినిమా ఆద్యంతం స్పీడుగా నడుస్తుందని అందుకే రాంప్ అని పెట్టినట్లు తెలిపారు. హాస్య మూవీస్ పతాకంపై జైన్స్ నాని దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన కె -రాంప్' సినిమా ఈనెల 18వ తేదీన దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్ లో భాగంగా రాజమండ్రి వచ్చిన కిరణ్ అబ్బవరం స్థానిక హొటల్ షెల్టాన్ లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సినిమా టీజర్, ట్రైలర్ కి మంచి స్పందన వచ్చిందన్నారు. యుక్తి తరేజా, నరేష్,



సాయికుమార్, అలీ, వెన్నెల కిషోర్, అజయ్ అనన్య, తదితరులు నటించిన ఈ సినిమా మాస్ కామెడీ ఎంటర్ ట్రైనర్ గా అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని కిరణ్ అబ్బవరం చెప్పారు. బాలయ్య సాంగ్ తో ఎంట్రీ ఉంటుందని ఆయన తెలిపారు. పండగ సీజన్ కావడంతో కుటుంబ సమేతంగా వీక్షించాలనుకునేవాళ్లంతా ఖచ్చితంగా ఈ సినిమాకు వస్తారన్న నమ్మకం ఉందని ఆయన ధీమా వ్యక్తంచేసారు. సినిమాటోగ్రఫీ సతీష్ రెడ్డి, ఎడిటర్ చోటా కె ప్రసాద్, సంగీతం చైతన్ భరద్వాజ్ సినిమాకు మంచి రెస్పాన్స్ తెచ్చారని తెలిపారు. ఘటోత్కచుడు వంటి పాత్రలతో కూడిన సినిమా చేయాలని ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా కిరణ్ అబ్బవరం తెలిపారు. చెన్నై లవ్, ఉగాది రోజు టైటిల్స్ తో సినిమాలు చేస్తున్నానని మరో మూడు సినిమాలు కూడా చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంత ప్రమోషన్ చేసినా ఈరోజుల్లో ప్రేక్షకులను థియేటర్ కి రప్పించడానికి ఎంత ప్రయత్నించినా రావడం చాల కష్టంగా మారిందని మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఓటిటి ఫ్లాట్ ఫారం బాగానే ఉందని చెప్పారు.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



**వి ఆర్ పురం, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మండలంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు మొదలయ్యాయి. రానున్న రోజులలో వి ఆర్ పురం లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభోగం వస్తుందని, ఆంధ్రప్రదేశ్ రాష్టంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి, జిల్లా అధ్యక్షులు శతకం బుల్లిబాబు నాయకత్వంలో ముందుకు తీసుకెళ్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అండిమినేని లీలా కృష్ణనాగేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం రంపచోడవరం నియోజకవర్గంలోని వి.ఆర్.పురం మండల పరిధిలోని మొద్దుల గూడెం (తోటపల్లి) గ్రామంలో వైసిపి పార్టీ నుండి సుమారు పదకొండు కుటుంబాలు సోడి ముత్తయ్య, సోడి ఏసు, ముసికి గంగరాజు,కారం అశోక్, కోవాసి రమేష్, మడకం ప్రదీప్, అప్పన్నపైడ్రాజు, కోవాసి రవి, కోవాసి కన్నయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అండిమినేని లీలా కృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ విధి విధానలు నచ్చక కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కడుపు సత్యనారాయణ (క్రాంతి), సయ్యద్ సర్పరాజు, కుంజా రమేష్, మడకం జనయ్య, తెలం సాయి బాబు, కారం దేవరాజు, కుంజా గాంధీ, దుర్గరావు, మడకం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ షాప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా మూర్తి



**చింతలపూడి, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం విలేకరి):** మొబైల్ వరల్డ్ షాప్ అధినేత వంకదారు సత్యనారాయణ వైస్ ప్రెసిడెంట్ గా, దాస్ సెక్రటరీగా శ్రీకృష్ణ మొబైల్ మధు, ట్రెజరీగా ఓం శ్రీ దేవి మొబైల్ షాప్ ఓం ప్రకాష్ నియమితులయ్యారు వీరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో మొబైల్ దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎవరు అయినా ఫోన్ లాక్ సాఫ్ట్వేర్ చెయ్యమని మొబైల్ షాప్ కివచ్చిన పోలీస్ వారి అధిశాల ప్రకారం బిల్ కానీ దానికి సంబందించిన ఐఎంఈఐ నెంబర్ కలిగిన బాక్స్ కాని ఉంటినే చేయాలని తెలిపారు. సర్వీస్ పరంగా గాని, సెల్స్ పరంగా గాని ఎదైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తాను అన్నారు.

## "ఛలో ఐటీడీఏ" విజయవంతం చేయండి

**ఏజెన్సీ గిరిజనులకు హక్కు కల్పించాలి**

**గిరిజనులు 30 సంవత్సరాలు పోడు సాగు భూములకు అక్కు పత్రాలు ఇవ్వాలి**


**సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ. కృష్ణచైతన్య**




**ఏలూరు జిల్లా/కుక్కునూరు: తెలుగు రాష్ట్రం :** ఏజెన్సీలో గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 22 తేదీన జరిగే కేర్ఆర్ పురం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ.కృష్ణచైతన్య కోరారు. మంగళవారం కుక్కునూరు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సభ్యులు పూరెం. లక్ష్మయ్య అధ్యక్షతన మండల కార్యవర్గ, కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణచైతన్య మాట్లాడారు. స్వాతంత్రం సిద్ధించి 78 ఏళ్లు గడుస్తున్నా గిరిజనుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందని పేర్కొన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇస్తామన్న ప్రభుత్వాల హామీలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయన్నారు. కుక్కునూరు,వేలేరుపాడు మండలాల్లో ముప్పై ఏళ్ల నుంచి పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులు, వలస గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలీన మండలాల్లోని గిరిజనులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో రెవెన్యూ యంత్రాంగం కుంటి సాకులతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో గిరిజనులకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని,అర్హులైన గిరిజనులు ఉద్యోగాలు కోల్పోతున్నారని తెలిపారు. గిరిజన గ్రామాలకు వసతులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కాగా ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన త్యాగధనులను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా, పీఠంమెక్కినాక ఒక రకంగా మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను ప్రభుత్వం దగా చేసిందని ఆరోపించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ పార్టీ తలపెట్టే ఛలో ఐటీడీఏ కార్యక్రమానికి గిరిజనులు,పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కృష్ణచైతన్య పిలునిచ్చారు. ఈ సమావేశంలో కుక్కునూరు కార్యదర్శి కొన్నె. లక్ష్మయ్య, వరకా.శ్యామల, ఐతా.సురేష్ బాబు, కురాకుల. బాబూరావు, వెంకటాచారి, పాపారావు, రమణయ్య, నగేష్, సోమరాజు, రమేష్, నవీన్, వెంకట్, మారయ్య, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్

**అధ్యాపకులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు**




**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 14 (తెలుగురాష్ట్రం విలేకరి):** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్ లో పనిచేస్తున్న ఇద్దరు అధ్యాపకులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. క్యాంపస్ లో రసాయన శాస్త్రం అధ్యాపకులైన డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ ఎస్. ప్రసాంతికి సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ సంస్థ "ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను విజయవాడలో అందజేసింది. వీరిని క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. అశోక్ ప్రత్యేకంగా అభినందించి, వారు విద్యాపరంగా అందిస్తున్న కృషిని ప్రశంసించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన అధ్యాపకులు ముందుకు సాగితే మరిన్ని పురస్కారాలు అందుకోవచ్చని వివరించారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
అక్టోబర్ 15,
బుధవారం 2025


# విండీస్‌పై రెండో టెస్టులో విజయం

## సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన భారత్

**వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 121 పరుగుల లక్ష్యఛేదనలో 63/1తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన టీమ్‌ఇండియా (%ఏమ్మఃఏ Xఅసఱఋః%) మరో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కేఎల్ రాహుల్ (58లిబీ 108 బంతుల్లో.. ఓవర్‌నైట్ స్కోరు 25) హాఫ్ సెంచరీతో మెరిశాడు. సాయి సుదర్శన్ (39బీ 76 బంతుల్లో) ఓవర్‌నైట్ స్కోరుకు మరో 9 పరుగులు జోడించి ఔటయ్యాడు. స్లిప్‌లో షై హెూప్ స్టన్నింగ్ క్యాచ్ (రోస్టన్ ఛేజ్ బౌలింగ్) అందుకోవడంతో సుదర్శన్ వెనుదిరిగాడు. శుభ్‌మన్ గిల్ (13బీ 15 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) కూడా ఛేజ్ బౌలింగ్‌లోనే గ్రీవ్స్‌కు చిక్కాడు. ధ్రువ్ జురెల్ (6లి) నాటౌట్‌గా నిలిచాడు. యశస్వి జైస్వాల్ (8)ని వారికన్ నాలుగో రోజే ఔట్ చేసిన సంగతి తెలిసిందే.**

### బిహార్ రంజీ వైస్ కెప్టెన్‌గా సూర్యవంశీ

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 518/5 వద్ద డిక్లేర్ చేసింది. యశస్వి జైస్వాల్ (175), శుభ్‌మన్ గిల్ (129లి), ధ్రువ్ జురెల్ (44), నితీశ్ రెడ్డి (43) అదరగొట్టారు. కుల్‌దీప్ యాదవ్ (5/82), జడేజా (3/46) విజృంభించడంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో విండీస్ 248 పరుగులకే కుప్పకూలి 270 పరుగుల లోటుతో ఫాలో ఆన్‌లో పడింది. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం



కరేబియన్ జట్టు గొప్పగా పోరాడింది. కాంప్‌బెల్ (115), షై హెూప్ (103) సెంచరీలకు తోడు జస్టిన్ గ్రీవ్స్ (50లి), రోస్టన్ ఛేజ్ (40), జైడెన్ సీల్స్ (32) రాణించడంతో 390 పరుగులకు ఆలౌటైంది.

# అవసరమైతే నన్ను టార్గెట్ చేయండి..

## హర్షిత్ రాణాపై ట్రోలింగ్.. స్పందించిన గంభీర్

త్వరలో ఆస్ట్రేలియా, భారత్ మధ్య 3 వన్డేలు, 5 టీ20ల సిరీస్ జరగనుంది. ఈ రెండు సిరీస్‌లకు టీమ్‌ఇండియా యువ పేసర్ హర్షిత్ రాణాను ఎంపిక చేశారు. హర్షిత్ ప్రధాన కోచ్ గంభీర్ కావున కోచ్ తాలుకా ప్లేయర్ అని రెండు సిరీస్‌లకు ఎంపిక చేశారంటూ మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ విమర్శించాడు. సోషల్ మీడియాలోనూ రాణాను ట్రోల్ చేస్తున్నారు. వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసిన అనంతరం గంభీర్ విలేకరులతో మాట్లాడాడు. ఈ క్రమంలో హర్షిత్‌పై జరుగుతున్న ట్రోలింగ్ గురించి స్పందించాడు. 23 ఏళ్ల కుర్రాడిని టార్గెట్ చేయడం సిగ్గుచేటని, అవసరమైతే తనని లక్ష్యంగా చేసుకోవాలంటూ ఫైరయ్యాడు.

### కోహ్లీ, రోహిత్‌పై శుభ్‌మన్ గిల్ ఎక్కువ ఫోకస్ పెట్టొద్దు: భారత మాజీ క్రికెటర్

'యూట్యూబ్ ఛానల్‌ని నడపాలనుకొనే ఓ వ్యక్తి 23 ఏళ్ల కుర్రాడిని టార్గెట్ చేయడం సిగ్గుచేటు. సోషల్ మీడియాలోనూ ట్రోలింగ్ జరుగుతోంది. అలాంటివారి మనస్తత్వాన్ని ఊహించుకోండి. మీరు నన్ను టార్గెట్ చేయాలనుకుంటే చేసుకోండి. నేను దానిని హ్యాండిల్ చేస్తా.



కానీ, మీ యూట్యూబ్ వ్యూస్ కోసం యువ ఆటగాడిని ట్రోల్ చేయడం సిగ్గుమాలిన చర్య. అతను తన సొంత అర్హతతో క్రికెట్ ఆడుతున్నాడు. ఇలాంటి యువ క్రికెటర్లను టార్గెట్ చేయకండి' అని గంభీర్ పేర్కొన్నాడు.

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 2027 ప్రపంచ కప్ ఆడతారా? అని గంభీర్‌ను ప్రశ్నించగా.. "ప్రపంచ కప్‌నకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. కాబట్టి.. ఇప్పుడేం జరుగుతుంది అనే దాని గురించి ఆలోచించాలి. కోహ్లీ, రోహిత్ నాణ్యమైన ఆటగాళ్లు. వీరిద్దరూ ఆస్ట్రేలియా పర్యటనలో రాణిస్తారని ఆశిస్తున్నాం' అని సమాధానమిచ్చాడు. ప్రస్తుతం వన్డేలు మాత్రమే ఆడుతున్న రో-కో ద్వయం ఆసీస్‌తో ఈనెల 19 నుంచి జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు ఎంపికైన సంగతి తెలిసిందే. కంగారులతో టీ20 సిరీస్ అక్టోబర్ 29 నుంచి మొదలుకానుంది.

ఆసీస్‌తో మూడు వన్డేలకు భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సిరాజ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్.

ఐదు టీ20లకు భారత జట్టు: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), తిలక్‌వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబె, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్, కుల్‌దీప్, హర్షిత్ రాణా, సంజు శాంసన్, రింకు సింగ్, వాషింగ్టన్ సుందర్.

# కోహ్లీ మూడు మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలు చేస్తాడు: హర్భజన్ సింగ్

టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికినస్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ త్వరలో ఆస్ట్రేలియాతో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌తో రీ ఎంట్రీ ఇవ్వనున్నారు. 2027 వన్డే ప్రపంచ కప్ ఆడాలనుకుంటున్న రో-కో ద్వయానికి ఆసీస్ సిరీస్ కీలకం కానుంది. ఈ నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ మాట్లాడాడు. రోహిత్, కోహ్లీ ఆటను చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు. ఫిట్‌నెస్ విషయంలో విరాట్‌కు తిరుగులేదన్నాడు.

'కోహ్లీ ఫిట్‌నెస్ గురించి ఎటువంటి ఆందోళన అవసరం లేదు. ఈ విషయంలో అతను ఎంతో పర్‌ఫెక్ట్. ప్రస్తుతం అతనితో కలిసి ఆడుతున్న వారిలో చాలా మంది కంటే ఫిట్‌గా ఉన్నాడు. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లీ ఫిటెస్ట్ ప్లేయర్ అని నిస్సందేహంగా చెప్పొచ్చు. అతని ఆట కోసం ఎదురుచూస్తున్నా. విరాట్ మరింత కాలం వన్డేల్లో కొనసాగాలని కోరుకుంటున్నా. ఆస్ట్రేలియా కోహ్లీకి



ఇష్టమైన ప్రదేశం. అక్కడ టన్నుల కొద్దీ పరుగులు రాబట్టాడు. మరోసారి రాణిస్తాడని నమ్మకంగా ఉన్నా. మూడు మ్యాచ్‌ల్లో కనీసం రెండు సెంచరీలు చేస్తాడని ఆశిస్తున్నా. రోహిత్ కూడా మంచి ప్రదర్శన చేసి జట్టు విజయానికి తోడ్పడాలని కోరుకుంటున్నా' నని భజ్జీ పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై కోహ్లీ 29 వన్డేలు ఆడిన విరాట్ 51.03 సగటుతో 1,327 పరుగులు చేశాడు. ఇందులో ఐదు సెంచరీలు, ఆరు అర్ధ శతకాలున్నాయి.

# ఆరో బౌలర్‌ను దించాల్సిందే!

వరుసగా రెండు ఘనవిజయాలతో ప్రపంచకప్‌ను ఆరంభించింది భారత మహిళల జట్టు. ప్రపంచకప్ కలను నెరవేర్చుకునే దిశగా అడుగులు సరిగానే పడుతున్నాయనుకున్నారు అభిమానులు. కానీ దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా రూపంలో బలమైన జట్లు ఎదురు కాగానే భారత్ విజయాలకు దూరమైంది. ఈ రెండు జట్లపై భారత్ బాగా ఆడలేదని చెప్పలేం. కాపాడుకోదగ్గ లక్ష్యాలనే ప్రత్యర్థులకు నిర్దేశించినా.. మధ్యలో బౌలర్లు విఫలమవడంతో ఓటములు తప్పలేదు. 252 పరుగుల ఛేదనలో 85కే అయిదు వికెట్లు కోల్పోయి కూడా దక్షిణాఫ్రికా గెలిచింది. ఆస్ట్రేలియా 331 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి పడేసింది. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఆరో బౌలర్ లేని లోటు స్పష్టంగా కనిపించింది.



కెప్టెన్ హర్మన్‌ప్రీత్ తన స్పిన్‌తో ఓ చేయి వేసినా పెద్దగా ఫలితం లేకపోయింది. బ్యాటింగ్‌ను బలోపేతం చేసేందుకు బౌలర్లను అయిదుగురికే పరిమితం చేయడంతో ప్రత్యామ్నాయాలు తగ్గిపోయాయి. ప్రధాన బౌలర్లలో ఒకరిద్దరు విఫలమైనా.. ఇంకొకరికి బంతి అందించే అవకాశం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్‌తో ఆదివారం జరిగే తర్వాతి మ్యాచ్‌కు అదనపు బౌలర్‌ను తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచకప్‌లో పేసర్ల కంటే స్పిన్నర్లే ఎక్కువ ప్రభావం చూపిస్తున్నారు. భారత జట్టులోనూ స్పిన్నర్ల ఆధిపత్యమే సాగుతోంది. తెలుగమ్మాయి శ్రీచరణితో పాటు దీప్తి శర్మ, స్నేహ్ రాణా నిలకడగా వికెట్లు తీస్తున్నారు. కానీ పేసర్లు ధారాళంగా పరుగులిచ్చేస్తున్నారు. ఆస్ట్రేలియాపై క్రాంతి గౌడ్, అమన్‌జ్యోత్ కలిసి 18 ఓవర్లలో 141 పరుగులు సమర్పించుకోగా.. చరణి, దీప్తి కలిసి 20 ఓవర్లలో 93 పరుగులే ఇచ్చారు. మరో స్పిన్నర్ స్నేహ్ కూడా మెరుగ్గానే బౌలింగ్ చేసినా.. వీరితో పోలిస్తే ఎక్కువ పరుగులిచ్చింది.

ఇండోర్ కూడా స్పిన్‌కు అనుకూలించే మైదానమే కావడంతో తర్వాతి మ్యాచ్‌కు స్పిన్ ఆల్‌రౌండర్ రాధ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునేందుకు ఆస్కారముంది. ఆమె కోసం బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ తన స్థానాన్ని త్యాగం చేయాల్సి రావచ్చు. ఆరో బౌలర్‌ను ఎంచుకోవడంపై కోచ్ అమోల్ మజుందార్ కూడా సంకేతాలు ఇచ్చాడు. "ఆస్ట్రేలియాతో మ్యాచ్ తర్వాత అయిదుగురు బౌలర్ల కూర్పుపై మేం ఒకసారి పరిశీలన జరపాలి. దీనిపై జట్టు యాజమాన్యంలో చర్చ జరుగుతుంది. తర్వాతి మ్యాచ్‌కు కూర్పు పరంగా సరైన నిర్ణయమే తీసుకుంటాం" అని మజుందార్ అన్నాడు.

# కెప్టెన్‌గా తొలి టెస్టు సిరీస్ విజయం

## ఆ సంప్రదాయాన్ని కొనసాగించిన శుభ్‌మన్ గిల్



వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 2-0తో క్లీన్ చేసింది. ఢిల్లీ వేదికగా జరిగిన రెండో టెస్టులో భారత్ ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. కెప్టెన్‌గా తొలి టెస్టు సిరీస్ సాధించిన శుభ్‌మన్ గిల్ ఎంఎస్ ధోనీ ప్రారంభించిన సంప్రదాయాన్ని కొనసాగించాడు. బీసీసీఐ కార్యదర్శి రాజీవ్ శుక్లా చేతులమీదుగా విన్నింగ్ ట్రోఫీ అందుకున్న గిల్.. దానిని జట్టులోకి కొత్తగా వచ్చిన నారాయణ్ జగదీశన్ చేతికి అందించాడు. పక్కనే ఉన్న రవీంద్ర జడేజా ఆట పట్టించేందుకు జగదీశన్ నుంచి ట్రోఫీ లాక్కొని మళ్లీ అతనికే ఇచ్చాడు. అనంతరం గిల్, యశస్వి జైస్వాల్ ట్రోఫీ పట్టుకొని ఫొటోలకు పోజులిచ్చారు. హెడ్ కోచ్ గంభీర్‌తో కలిసి గిల్, కుల్‌దీప్ ప్రత్యేకంగా ఫొటోలు దిగారు. చివరకు జట్టుసభ్యులు, సహాయక బృందం ట్రోఫీ ముందు గ్రూప్ ఫొటోకు పోజులిచ్చారు. జట్టులో కొత్తగా వచ్చిన ఆటగాళ్లకు ట్రోఫీని అందించే సంప్రదాయాన్ని ధోనీ కెప్టెన్‌గా ప్రారంభించాడు. తర్వాత కెప్టెన్లుగా వ్యవహరించిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగించారు. ఇప్పుడు గిల్ కూడా అదే పంథాను అనుసరిస్తున్నాడు.

# గ్రీస్‌లో ప్రభాస్ హీరోయిన్...
## 'రాజా సాబ్' పోస్టర్ డ్రెస్‌తో మాళవిక సందడి!

- గ్రీస్‌లో 'ది రాజా సాబ్' చివరి దశ షుటింగ్
- రెండు పాటల చిత్రీకరణ బ్యాలెన్స్
- సినిమా పోస్టర్ ఉన్న డ్రెస్‌లో కనిపించిన హీరోయిన్ మాళవిక
- ప్రభాస్ డ్యాన్స్ ఎనర్జీపై దర్శకుడు మారుతి ప్రశంసల ట్వీట్
- 2026 జనవరి 9న సినిమా విడుదల చేస్తున్నట్లు ప్రకటన
- ఇప్పటికే టాకీ పార్ట్, డబ్బింగ్ పనులు పూర్తి




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న హారర్ థ్రిల్లర్ 'ది రాజా సాబ్' సినిమా చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం చిత్ర యూనిట్ గ్రీస్‌లో మిగిలి ఉన్న రెండు పాటల చిత్రీకరణలో బిజీగా ఉంది. ఈ సందర్భంగా సినిమా హీరోయిన్లలో ఒకరైన మాళవిక మోహనన్, తన ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ ఖాతాల్లో పోస్ట్ చేసిన ఒక ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గ్రీస్‌లోని అందమైన లొకేషన్‌లో 'ది రాజా సాబ్' సినిమా పోస్టర్‌తో డిజైన్ చేసిన డ్రెస్‌ను ధరించి ఆమె కనిపించారు. "లైట్స్, కెమెరా, గ్రీస్!" అనే క్యాప్షన్‌తో ఈ ఫోటోను పంచుకున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఒక రోజు ముందే దర్శకుడు మారుతి కూడా ఇదే తరహాలో సినిమా పోస్టర్ ఉన్న టీ-షర్ట్ ధరించి ఉన్న ఫోటోను షేర్ చేశారు. ఇప్పుడు హీరోయిన్ కూడా అదే తరహాలో ప్రమోషన్ చేయడంతో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, డబ్బింగ్ పనులు కూడా ప్రారంభమయ్యాయని సమాచారం. పాటల చిత్రీకరణ పూర్తయితే సినిమా మొత్తం పూర్తయినట్లే. ఇటీవల దర్శకుడు మారుతి, పాటల్లో ప్రభాస్ ఎనర్జీని చూసి తాను ఆశ్చర్యపోయినట్లు తెలిపారు. 'బాహుబలి' సినిమాలో కట్టప్ప, బాహుబలి పాదాన్ని తన తలపై పెట్టుకునే ఐకానిక్ సీన్‌ను పోస్ట్ చేస్తూ, "నా డార్లింగ్ ప్రభాస్ ఎనర్జీ చూస్తుంటే ఇది గుర్తొచ్చింది" అని తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. ప్రభాస్ కెరీర్‌లో పూర్తిస్థాయి హారర్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఇటీవల విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. తొలుత ఈ ఏడాది డిసెంబర్ 5న విడుదల చేయాలని భావించినా, తాజాగా కొత్త విడుదల తేదీని ప్రకటించారు. ఈ చిత్రాన్ని 2026 జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సినిమాలో నిధి అగర్వాల్ మరో హీరోయిన్‌గా నటిస్తుండగా, కార్తీక్ పళని సినిమాటోగ్రఫీ, తమన్ సంగీతం అందిస్తున్నారు.

# ఆ పాత్ర దేశంలోని ప్రతి ఇంట్లో నాకు స్థానం కల్పించింది: అవికా గోర్

- 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్‌పై నటి అవికా గోర్ వ్యాఖ్యలు
- ఇప్పటికీ 'ఆనంది' అని పిలవడం గర్వంగా ఉందని వెల్లడి
- ఆ గుర్తింపు తనను ప్రతీ ఇంటికి కనెక్ట్ చేసిందన్న నటి
- టీవీ షోలో పెళ్లి చేసుకోవడంపైనా స్పందన
- విమర్శలు వస్తాయని ముందే ఊహించానని వ్యాఖ్య
- చిన్నతనం నుంచే భిన్నమైన నిర్ణయాలు తీసుకున్నానని వెల్లడి



'బాలికా వధు' (తెలుగులో 'చిన్నారి పెళ్లికూతురు') సీరియల్‌తో దేశవ్యాప్తంగా ప్రతీ ఇంట్లోనూ సుపరిచితమైన నటి అవికా గోర్, 'ఆనంది' పాత్ర తనకు ఇచ్చిన గుర్తింపు గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆ సీరియల్ ముగిసి ఏళ్లు గడుస్తున్నా, ప్రజలు ఇప్పటికీ తనను ఆనందిగానే గుర్తుంచుకోవడంపై గర్వంగా ఉందని తెలిపింది. ఇటీవలే ఒక జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అవికా తన మనసులోని మాటలను పంచుకుంది. "నిజం చెప్పాలంటే, ప్రజలు నన్ను ఇంకా ఆనంది అని పిలుస్తుంటే గర్వంగా ఉంటుంది. అది నా రెండో పేరులా మారిపోయింది. ఈరోజే ఎయిర్‌పోర్టులో ఒక ఆంటీ నా దగ్గరికి వచ్చి బుగ్గలు గిల్లి 'ఆనంది' అని ప్రేమగా పిలిచింది. ప్రజలు నన్ను అలా పిలవడం ఆపేయాలని నేను అస్సలు కోరుకోవట్లేదు. ఎందుకంటే ఆ పాత్రే నన్ను దేశంలోని ప్రతీ కుటుంబానికి దగ్గర చేసింది. ఎంతోమందికి నన్ను కూతురిని చేసింది. ఆ బంధాన్ని నేను ఎప్పటికీ గౌరవిస్తాను" అని అవికా వివరించింది. ఇటీవలే తన ప్రియుడు మిలింద్ చంద్వానీని 'పతి పత్నీ ఔర్ పంగా' అనే రియాలిటీ షోలో పెళ్లి చేసుకోవడంపైనా ఆమె స్పందించింది. "టీవీ షోలో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడే, దీనిపై విమర్శలు వస్తాయని మాకు తెలుసు. ఆ విషయంలో మేమేమీ ఆశ్చర్యపోలేదు. నేను చిన్నప్పటి నుంచి నా కెరీర్‌లోనూ, జీవితంలోనూ భిన్నమైన నిర్ణయాలు తీసుకుంటూ వచ్చాను. చాలామంది నా నిర్ణయాలతో ఏకీభవించకపోయినా, నా దారిని నేనే నిర్మించుకోవాలని నమ్మాను" అని పేర్కొంది. "నా పెళ్లి కూడా భిన్నంగానే ఉంటుందని నాకు తెలుసు. నా జీవితం, నా ప్రయాణం చూసి చాలామంది కలలు కంటారు. ఆ విషయాన్ని నేను అంగీకరిస్తాను, అందుకు ఎంతో కృతజ్ఞతగా ఉంటాను. కానీ, ఇక్కడి వరకు రావడం అంత సులభం కాదు" అని అవికా గోర్ వెల్లడించింది. 'బాలికా వధు' తర్వాత 'ససురాల్ సిమర్ కా' వంటి సీరియల్స్‌తోనూ, ఆ తర్వాత సినిమా రంగంలోనూ అవికా మంచి గుర్తింపు తెచ్చుకున్న విషయం తెలిసిందే.

# 'మీసాల పిల్ల' పాట వచ్చేసింది...
## ఎంజాయ్ చేయండి: చిరంజీవి

- చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబోలో 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్రం
- 'మీసాల పిల్ల' పాట లిరికల్ వీడియో విడుదల
- సోషల్ మీడియాలో పంచుకున్న చిరంజీవి




మెగాస్టార్ చిరంజీవి తన కొత్త చిత్రం నుంచి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌తో అభిమానుల ముందుకు వచ్చారు. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన నటిస్తున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమాలోని 'మీసాల పిల్ల' అనే పాట లిరికల్ వీడియోను పంచుకున్నారు. ఆ పాట వివరాలను స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. ఈ పాటను దిగ్గజ గాయకుడు ఉదిత్ నారాయణ్ ఆలపించడం విశేషం. ఈ విషయాన్ని ప్రకటిస్తూ చిరంజీవి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ మెలోడీకి భాస్కరభట్ల సాహిత్యం అందించారు. ఉదిత్ నారాయణ్‌తో పాటు శ్వేతా మోహన్ కూడా ఈ గీతాన్ని ఆలపించారు. గతంలో చిరంజీవి చిత్రాలలోని ఎన్నో సూపర్ హిట్ గీతాలకు ఉదిత్ నారాయణ్ తన గాత్రాన్ని అందించారు. చాలా కాలం తర్వాత మళ్లీ ఈ కాంబినేషన్‌లో పాట రానుండటంతో అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాలో చిరంజీవి సరసన నయనతార, కేథరిన్ ట్రెసా కథానాయికలుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్‌బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ అప్‌డేట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది.

# ఈ స్థాయికి రావడానికి పదేళ్లు పట్టింది:'ఓజీ' విలన్ సుదేవ్ నాయర్!

- యంగ్ విలన్ గా సుదేవ్ నాయర్
- మలయాళంలో పాప్యులర్ ఆర్టిస్ట్
- తెలుగులోను దక్కిన గుర్తింపు
- కన్నడలోను ఎంట్రీ ఇచ్చిన నటుడు




ఓటీటీ వచ్చిన తరువాత ఇతర భాషలకు చెందిన ఆర్టిస్టులు చాలామంది ప్రేక్షకులకు పరిచయమవుతున్నారు. ఈ కారణంగా వాళ్లు టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వగానే ప్రేక్షకులు గుర్తుపడుతున్నారు .. అభిమానిస్తున్నారు. అలా ముందుగానే తెలుగు ప్రేక్షకులకు పరిచయమై .. ఆ తరువాత టాలీవుడ్ కి వచ్చిన నటుడిగా 'సుదేవ్ నాయర్' కనిపిస్తారు. తాజాగా 'సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ యంగ్ విలన్ అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. "నేను పుట్టింది ముంబైలో .. ఇప్పటికీ అమ్మానాన్న అక్కడే ఉంటారు. నేను మాత్రం 'త్రివేండ్రం'లో సెటిలయ్యాను. సినిమాలలో మా ఫ్యామిలీకి సంబంధించిన వారెవరూ లేరు. నటనలో శిక్షణ తీసుకుని నేనే ప్రయత్నాలు చేస్తూ .. అవకాశాలు సంపాదించుకుంటూ వెళ్లాను. సరైన గుర్తింపు రావడానికి పదేళ్లు పట్టింది. మొదటిసారి మమ్ముట్టి గారి కాంబినేషన్ లో చేసేటప్పుడు మాత్రం చాలా భయపడ్డాను" అని చెప్పారు. "తెలుగులో నా మొదటి సినిమా 'టైగర్ నాగేశ్వరరావు'. ఆ తరువాత 'దేవర' .. 'ఓజీ' సినిమాలు చేశాను. ఈ రెండు సినిమాలలోని పాత్రలు నాకు మరింత గుర్తింపును సంపాదించి పెట్టాయి. ఎన్టీఆర్ గారితో చాలా క్లోజ్ గా మాట్లాడే అవకాశం దక్కింది. పవన్ కల్యాణ్ గారి బిజీ షెడ్యూల్స్ వలన పెద్దగా మాట్లాడటం కుదరలేదు. ప్రస్తుతం కన్నడలో 'యశ్' తోను ఒక సినిమా చేస్తున్నాను" అని అన్నారు.

## వెంకట్ ప్రభు దర్శకత్వంలో
# శివకార్తికేయన్



శివకార్తికేయన్, వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఓ సినిమా రాబోతోంది. ఈ ప్రాజెక్టుపై దర్శకుడు వెంకట్ ప్రభు మాట్లాడుతూ, 'శివకార్తికేయన్ కథానాయకుడిగా తాను దర్శకత్వం వహించే చిత్రం ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. వచ్చే యేడాది జనవరిలో చిత్రీకరణ ప్రారంభమతుంది. ఇది వైవిధ్యభరితమైన సైన్స్ ఫిక్షన్ మూవీ. ఇందులో హీరోను సరికొత్త లుక్‌లో చూస్తారు. ఈ ప్రాజెక్టులో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, నిర్మాణ సంస్థ, సంగీత దర్శకుడు తదితర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.

# శ్రీలీల 'ఏజెంట్ మిర్చి'



టాలీవుడ్ కథానాయిక శ్రీలీల 'ఏజెంట్ మిర్చి' పేరుతో సరికొత్త గెటప్‌లో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఆమె నటించిన 'రాబిన్‌హుడ్', 'జూనియర్' సినిమాలు ఈ ఏడాది విడుదలైన విషయం తెలిసిందే. ఈనెల 31న విడుదలకానున్న 'మాస్ జాతర'లోనూ ఆమె నటించారు. ఇవే కాకుండా తెలుగు, తమిళ, హిందీలోనూ మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. తాజాగా తన ఇన్‌స్ట్రాలో కొత్తగా 'ఏజెంట్ మిర్చి' పేరుతో పెట్టిన పోస్టర్ ఆసక్తిగా మారింది. ఈనెల 19న పూర్తి వివరాలు వెల్లడిస్తామని అందులో రాసివుంది. ఇది హిందీ ప్రాజెక్టా? లేక వెబ్‌సిరీసా? అనేది ఇంకా స్పష్టత రాలేదు. పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్, శివకార్తికేయన్ 'పరాశక్తి', కార్తిక్ ఆర్యన్‌తో సినిమాలు చేస్తున్నారు.

# కబడ్డీ కోర్టులో విక్రమ్ తనయుడు..

- ఆసక్తి రేపుతున్న 'బైసన్' ట్రైలర్
- తమిళ స్టార్ విక్రమ్ కొడుకు ధ్రువ్ విక్రమ్ కొత్త చిత్రం 'బైసన్'
- ఈనెల 17న తెలుగు, తమిళ భాషల్లో విడుదల
- కబడ్డీ క్రీడా నేపథ్యంలో వస్తున్న సినిమా
- సామాజిక వివక్షపై పోరాటమే కథాంశం
- 'కర్ణన్' ఫేమ్ మారి సెల్వరాజ్ దర్శకత్వం

తమిళ స్టార్ హీరో చియాన్ విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్ కథానాయకుడిగా, సంచలన దర్శకుడు మారి సెల్వరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బైసన్'. 'కర్ణన్', 'మామన్నన్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మారి సెల్వరాజ్ నుంచి వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 17న తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. తాజాగా విడుదలైన ట్రైలర్ చూస్తే, ఈ సినిమా కబడ్డీ క్రీడా నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ డ్రామా అని స్పష్టమవుతోంది. 1980ల నాటి తమిళ గ్రామీణ వాతావరణంలో ఈ కథను చూపించనున్నారు. ఒక కబడ్డీ ఆటగాడి జీవితంలోని సంఘర్షణ, సమాజంలో అణగారిన వర్గాలు ఎదుర్కొనే వివక్ష, దానిపై వారు చేసే తిరుగుబాటు వంటి అంశాలను మారి సెల్వరాజ్ తనదైన వాస్తవిక శైలిలో కళ్లకు కట్టనున్నట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ధ్రువ్ విక్రమ్ ఈ చిత్రంలో ఓ పల్లెటూరి కబడ్డీ ఆటగాడిగా శక్తిమంతమైన పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ సినిమాలో ధ్రువ్ విక్రమ్ సరసన అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. లాల్, పశుపతి, రజిషా విజయన్, అమీర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కబడ్డీ ఆటతో పాటు సామాజిక అంశాలను జోడించి మారి సెల్వరాజ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి.




TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339